# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ | శుక్రవారం 3-1-2020 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-20 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :26 | సంచిక: 136 | పేజీలు: 4 | వెల: రూ.1/-


### మతం ఆధారంగానే పాకిస్తాన్ ఏర్పడింది : ప్రధాని మోదీ

బెంగళూరు, జనవరి 2 : మతం ఆధారంగానే పాకిస్తాన్ ఏర్పడింది అని ప్రధాని నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. కర్ణాటక తుమకూరులోని శ్రీ సిద్ధగంగ మఠంలో ప్రధాని నరేంద్ర మోదీ పర్యటించారు. ఈ సందర్భంగా మోదీ మాట్లాడారు. మతం ఆధారంగానే పాకిస్తాన్ ఏర్పడింది. అక్కడ మతపరమైన మైనార్టీలు హింసించబడుతున్నారు అని తెలిపారు. వేధింపులకు గురైన మైనార్టీలు శరణార్థులుగా భారత్‌కు వచ్చారు. కానీ కాంగ్రెస్, దాని మిత్రపక్షాలు మాత్రం పాకిస్తాన్‌కు వ్యతిరేకంగా మాట్లాడవు. భారత్‌లో ఉంటున్న శరణార్థులకు వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ ర్యాలీలు తీస్తుంది. ఇవాళ పార్లమెంట్ నిర్ణయాలకు వ్యతిరేకంగా ఆందోళనలు చేస్తున్న వారందరికీ నేను ఒకటే చెప్పదల్చుకున్నాను. పాకిస్తాన్ చర్యలను అంతర్జాతీయ స్థాయిలో తెలియజేసేలా ఆందోళనలు చేయండని చెప్పారు మోదీ. ఒక వేళ ఆందోళన చేయాలనుకుంటే.. గత 70 సంవత్సరాల్లో పాకిస్తాన్ చేసిన చర్యలకు వ్యతిరేకంగా మీ స్వరం పెంచాలని మోదీ సూచించారు. శ్రీసిద్ధగంగ మఠం నుంచి 2020 సంవత్సరాన్ని ప్రారంభించడం అదృష్టంగా భావిస్తున్నాను అని మోదీ తెలిపారు. శ్రీసిద్ధగంగ మఠం యొక్క పవిత్ర శక్తి దేశ ప్రజల జీవితాలను సుసంపన్నం చేయాలని కోరుకుంటున్నాను అని పేర్కొన్నారు. 21వ శతాబ్దంలోని మూడో దశకంలోకి భారతదేశం కొత్త శక్తి మరియు నూతన శక్తితో ప్రవేశించిందన్నారు. గత దశకం ప్రారంభమైనప్పుడు దేశంలో ఎలాంటి వాతావరణం ఉండో మీకు గుర్తుండే ఉంటుందన్నారు. కానీ ఈ మూడో దశకం అంచనాలు, ఆకాంక్షలు బలమైన పునాదులతో ప్రారంభమయ్యాయని మోదీ స్పష్టం చేశారు.



నిర్మల్ జిల్లా దిలావర్ పూర్ మండలం సిర్గాపూర్ గ్రామంలో రెండో విడత పల్లె ప్రగతి కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటిన మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి.

# మొక్కలే జీవకోటికి ప్రాణాధారం

### మొక్కలునాటి పచ్చదనాన్ని పెంచాలి
### గ్రీన్ ఇండియా ఛాలెంజ్ స్వీకరించిన మంత్రి జగదీష్ రెడ్డి

హైదరాబాద్,జనవరి2(ఆర్ఎన్ఎ): మొక్కలే జీవకోటికి ప్రాణాధారమని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి జగదీష్ రెడ్డి తెలిపారు. ఇవాళ నాటిన మొక్కలే తర్వాత వృక్షాలై సకల జీవులకు జీవనాధారమవుతాయని ఆయన అన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడాన్ని బాధ్యతగా తీసుకోవాలన్నారు. గ్రీన్ ఇండియా చాలెంజ్‌లో భాగంగా ఆయన గురువారం మినిస్టర్స్ క్వార్టర్స్‌లో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో పచ్చదనం పెంచాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు హరితహారం కార్యక్రమం చేపట్టారు. హరితహారంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా కొన్ని కోట్ల మొక్కలు నాటామని మంత్రి గుర్తు చేశారు. హరితహారం కార్యక్రమానికి కొనసాగింపుగా.. కాస్త వినూత్నంగా ఎంపీ జోగినిపల్లి సంతోష్ కుమార్ గ్రీన్ ఇండియా చాలెంజ్ కార్యక్రమాన్ని ప్రారంభించడం సంతోషకరం అని మంత్రి అన్నారు. ఈ కార్యక్రమంలో చాలామంది ప్రజాప్రతినిధులు, అధికారులు, సెలబ్రిటీలు, పారిశ్రామికవేత్తలు పాల్గొని కొన్ని లక్షల మొక్కలు నాటారని మంత్రి గుర్తు చేశారు. సెలబ్రిటీలు మాత్రమే కాకుండా, రాష్ట్రంలోని ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణలో పాలుపంచుకోవాలని మంత్రి సూచించారు. ఈ సందర్భంగా మంత్రి మరో ముగ్గురికి గ్రీన్ ఇండియా చాలెంజ్ విసిరారు. వారిలో సీఎస్ సోమేష్ కుమార్, ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ ప్రభాకర్ రావు, టీసీపీడీసీఎల్ సీఎండీ రఘురామారెడ్డి ఉన్నారు. ఈ సందర్భంగా పలువురు అధికారులు మంత్రికి న్యూ ఇయర్ విషెస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవరకొండ ఎమ్మెల్యే రవీందర్ నాయక్, రాష్ట్ర బేవరేజీస్ కార్పోరేషన్ చైర్మన్ దేవి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# న్యూ ఇయర్‌కి రూ.378కోట్ల లిక్కర్ విక్రయాలు

హైదరాబాద్,డిసెంబర్ 2 (ఆర్ఎన్ఎ): నూతన సంవత్సర వేడుకల నేపథ్యంలో మద్యం ఏరులై పారింది. పెద్దసంఖ్యలో మందుబాబులు డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో పోలీసులకు చిక్కారు.

కేవలం రెండు రోజుల వ్యవధిలోనే రాష్ట్రంలో రూ.378 కోట్ల విక్రయాలు జరిగాయి. సంవత్సరం చివరి రోజు మందు అందుబాటులో ఉండదేమో అనే ఆందోళనతో చాలా మంది ముందు రోజే కొనుగోలు చేసి నిల్వ చేసుకున్నారు. బీరు, మద్యం కలిపి రాష్ట్రంలో రెండు రోజుల్లోనే 83.43 లక్షల లీటర్లు ఖాళీ చేశారు. సగటు రోజువారీ అమ్మకాల కంటే డిసెంబరు 31వ తేదీ ఒక్కరోజే 150 శాతం ఎక్కువగా జరిగాయి.

డిసెంబరు ఒకటో తేదీ నుంచి 31వ తేదీ వరకూ రాష్ట్రంలో రూ.2,050 కోట్ల విక్రయాలు జరిగాయి. ఈ లెక్కన సగటున రోజుకు రూ.66 కోట్ల మందు అమ్మారన్నమాట. అయితే, కొత్త సంవత్సర వేడుకల సందర్భంగా డిసెంబరు 30, 31 తేదీల్లో రెండు రోజుల్లోనే రూ.378 కోట్ల సరకు అమ్మారు. విడివిడిగా చూసుకుంటే డిసెంబరు 30న 2.93 లక్షల కేసుల మద్యం, 2.97 లక్షల కేసుల బీర్ల చొప్పున రూ.220 కోట్లు, 31వ తేదీన 1.92 లక్షల కేసుల మద్యం, 2.15 లక్షల కేసుల బీర్ల చొప్పున రూ.158 కోట్ల అమ్మకాలు జరిగాయి. వీటిని లీటర్లలో చూస్తే.. రెండు రోజుల్లో రాష్ట్రంలో సుమారు 39.78 లక్షల లీటర్ల బీర్లు, 43.65 లక్షల లీటర్ల మద్యం తాగేశారు

# తెలుగు వైద్యుల ఆచూకీ లభ్యం

### సిక్కింలో ఉన్నట్లు గుర్తించిన పోలీసులు

హైదరాబాద్,డిసెంబర్ 2 (ఆర్ఎన్ఎ):ఢిల్లీలో గత నెల 25న అదృశ్యమైన ఇద్దరు తెలుగు వైద్యులు దిలీప్ సత్య, హిమబిందు ఆచూకీ లభ్యమైంది. వీరిద్దరూ సిక్కింలో ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. హిమబిందు భర్త శ్రీధర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న దిల్లీ పోలీసులు బృందాలుగా విడిపోయి వారి కోసం గాలింపు ముమ్మరం చేశారు. ఇందులో భాగంగా వారి సామాజిక మాధ్యమాలపై నిఘా ఉంచారు. ఈ క్రమంలో దిలీప్ సత్య తన సోషల్ మీడియా ఖాతాను ఉపయోగించడంతో సాంకేతిక నిఘా ద్వారా వారి పోలీసులు గుర్తించారు. వీరిద్దరూ సిక్కిం ఎందుకు వెళ్లారు? వీరి అదృశ్యం వెనుక కారణాలపై విచారణ జరపనున్నారు. కడప జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన హిమబిందు, అనంతపురం జిల్లా హిందూపూర్‌కు చెందిన దిలీప్ సత్య అదృశ్యమైనట్లు డిసెంబర్ 25న దిల్లీలోని హాజ్‌ఖాన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు నమోదైంది. వైద్యుల ఆచూకీపై వారి కుటుంబ సభ్యులకు పోలీసులు సమాచారం అందించారు.

### జమ్మూకశ్మీర్‌లో ఘోర ప్రమాదం : ఏడుగురు మృతి

శ్రీనగర్, జనవరి 2: జమ్మూకశ్మీర్‌లో ఘోర రోడ్డుప్రమాదం చోటు చేసుకుంది. రాజౌరీ జిల్లాలోని లంబేరీలో ప్రయాణికులతో వెళ్తున్న ఓ బస్సు అదుపుతప్పి లోయలో పడిపోయింది. ఈ ప్రమాదంలో అక్కడికక్కడే ఏడుగురు ప్రాణాలు కోల్పోయారు. మరో 15 మంది తీవ్రంగా గాయపడ్డారు. ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం సమీప ఆస్పత్రికి తరలించారు.

### చరిత్రలో నేటినిజం



కం॥ సరియగు సంకల్పముతో
'కరకర'లను జనుల కడ 'దిగంబర కవి'యై
'చెరబండ రాజు' బలముగ
తెరలను తొలగించి వాడు తేకువతోడన్!!

(జనవరి 3 చెరబండ రాజు జయంతి..)



-రాధశ్రీ

సెల్: 9494481210

## గురుగోవింద్ సింగ్ బోధనలు అనుసరణీయం

### జయంతి సందర్భంగా ప్రధాని మోదీ ట్వీట్

న్యూఢిల్లీ,జనవరి2(ఆర్ఎన్ఎ): ప్రముఖ సిక్కు గురువు గురుగోవింద్ సింగ్ జయంతిని పురస్కరించుకొని ప్రధాని మోదీ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన బోధనలను గుర్తు చేసుకున్నారు. ఈ మేరకు ఆయన ఒక ట్వీట్ పోస్టు చేశారు. గురుగోవింద్ సింగ్ బోధనలను గుర్తు చేసుకోవాల్సిన అవసరం

ఎంతైనా ఉందని చెబుతూ.. ఆయన బోధనలు ఉన్న వీడియోను ట్వీట్ చేశారు. నవ భారత్ నిర్మాణానికి గురుగోవింద్ మాటలను మూలసూత్రాలుగా ప్రధాని అభివర్ణించారు. నవభారతావని నిర్మాణానికి అవసరమైన శక్తి సామర్థ్యాలు గురుగోవింద్ సింగ్ బోధనల్లో ఉంటాయని తాను బాగా విశ్వసిస్తానని మోదీ చెప్పారు. ఆయన బోధనలు ప్రజలపై అంతటి ప్రభావాన్ని చూపిస్తాయని చెప్పారు. తన జీవితాన్నంతా ప్రజలకు సేవ చేసేందుకే కేటాయించిన మహోన్నత వ్యక్తి గురుగోవింద్ సింగ్ అని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. ఆయన అన్యాయంపై పోరాటం చేశారని, అసమాన ధైర్య సాహసాలు కనబరిచారని గుర్తు చేసుకున్నారు. భావితరాలకు ఆయన బోధనలు ఎంతో ప్రేరణ కలిగిస్తాయని అన్నారు. ఈ మేరకు రాజ్‌నాథ్ ట్వీటర్‌లో పోస్టు చేశారు. మరోవైపు గురుగోవింద్ సింగ్ జయంతిని పురస్కరించుకొని అమృత్‌సర్‌లోని స్వర్ణదేవాలయంలో సిక్కులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అక్కడి సరోవరంలో పుణ్యస్నానాలు ఆచరించారు. రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, ఉపరాష్ట్రపతి వెంకయ్యానాయుడు గురుగోవింద్ జయంతి సందర్భంగా ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు.

## మరోమారు ఢిల్లీలో అగ్నిప్రమాదం

### బ్యాటరీ ఫ్యాక్టరీలో పేలుడు

న్యూఢిల్లీ,జనవరి2(ఆర్ఎన్ఎ): మరో అగ్నిప్రమాదంతో రాజధాని ఢిల్లీ వణికింది. ఢిల్లీలోని ఓ బ్యాటరీ ఫ్యాక్టరీలో పేలుడు ఘటన చోటుచేసుకున్నది. పీరా గర్హి ప్రాంతంలో ఉన్న ఫ్యాక్టరీలో ఈ ఘటన జరిగింది. ఈ ప్రమాదంలో ఓ కార్మికుడు శిథిలాల్లో చిక్కుకున్నాడు. సుమారు 35 అగ్నిమాపక ఇంజిన్లు అగ్నిప్రమాద ప్రాంతానికి చేరుకున్నాయి. ఎన్డీఆర్ఎఫ్ దళం కూడా అక్కడకు చేరుకున్నది. ఉదయం 4.30 నిమిషాలకు ప్రమాదం జరిగినట్లు ఫైర్ డిపార్ట్‌మెంట్‌కు ఫోన్ వచ్చింది. మొదట్లో ఏడు ఫైర్ ఇంజిన్లు అక్కడకు పంపారు. అయితే ఉదయం 9 గంటల సమయంలో బ్యాటరీ ఫ్యాక్టరీలో మరోసారి పేలుడు జరిగింది. దీంతో అక్కడకు మరిన్ని ఫైరిరజన్లు పంపారు. అగ్నిప్రమాద ఘటన గురించి సీఎం కేజీవ్రాల్ ఆరా తీస్తున్నారు.

# కృత్రిమ మేధా సంవత్సరంగా 2020

### లోగో, వెబ్‌సైట్ ప్రారంభించిన ఐటి మంత్రి కేటీఆర్

లోగో, వెబ్‌సైట్ ప్రారంభించిన ఐటి మంత్రి కేటీఆర్ హైదరాబాద్,డిసెంబర్ 2 (ఆర్ఎన్ఎ): నూతన సంవత్సరం 2020ని తెలంగాణ రాష్ట్రం కృత్రిమ మేధా సంవత్సరంగా జరుపుకోనున్నట్లు రాష్ట్ర ఐటీశాఖ మంత్రి కేటీఆర్ అధికారికంగా ప్రకటించారు. దానికి సంబంధించిన లోగో, వెబ్‌సైట్‌ను మంత్రి గురువారం హైదరాబాద్,గ్రీన్‌పార్క్ హోటల్‌లో కేటీఆర్ ఆవిష్కరించారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ, టెక్నాలజీ ద్వారా ఎన్నో సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు. సరికొత్త సాంకేతికతను అందిపుచ్చుకోవాలని పిలుపునిచ్చారు. సాంకేతిక ఫలాలు ప్రజలకు అందేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఇంటెల్, పీహెచ్ఎఫ్ఐ, అడోబ్, నివిడ. హెక్సాగన్ సంస్థలతో ఈమేరకు తెలంగాణ ప్రభుత్వం అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. 'సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ ఇన్ ఏఐ' ఏర్పాటు కోసం ఐఐటీ ఖరగ్‌పూర్‌తో ఒప్పందం కుదుర్చుకుంది. ఐఐటీ హైదరాబాద్ ..మౌలిక సదుపాయాలు, స్ట్రాటజీ భాగస్వామిగా వ్యవహరించనుంది. రిజిస్ట్రేషన్ శాఖతో పాటు పోలీస్ శాఖలో పైలట్ ప్రాజెక్టులను మంత్రి కేటీఆర్ ప్రారంభించారు. తెలంగాణ ఏఐ బేస్డ్ ఎస్టిమేషన్ మేనేజ్‌మెంట్ అప్లికేషన్ ప్రారంభంతో పాటు 2020 ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ క్యాలెండర్‌ను మంత్రి విడుదల చేశారు. నివిదతో స్కిల్ ట్రైనింగ్ సెంటర్ ఏర్పాటు, ఆడోబ్, కెపాసిటీ బిల్డింగ్ ప్రాసెసింగ్ సెంటర్ ఏర్పాటు,. ఐఐఐటీ వాచ్‌తో ఎడ్యూకేషన్, ట్రైనింగ్, వాద్వాని ఆర్టిఫిషియల్, హెక్సగాన్ వ్యాపబుల్ సెంటర్ ఏర్పాటుకు, నార్వే క్లస్టర్ ఆఫ్ ఐప్లైడ్ ఏఐతో, మహీంద్రా కాలేజీతో, నాస్కామ్‌తో ఒప్పందాలు కుదిరాయి. ఐటీశాఖ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్, ఐటీ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.



నగరంలో జరిగిన కార్యక్రమంలో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ లోగోను, యాప్‌ను ప్రారంభించిన ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి కెటి రామారావు.

# 4న టీఆర్ఎస్ పార్టీ విస్తృతస్థాయి సమావేశం

### మున్సిపల్ ఎన్నికలు లక్ష్యంగా కెసిఆర్ దిశా నిర్దేశం
### పార్టీ శ్రేణులకు స్పష్టమైన ఆదేశాలు ఇవ్వనున్న గులాబీ బాస్

హైదరాబాద్,జనవరి2(ఆర్ఎన్ఎ): మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలోఈ నెల 4వ తేదీన టీఆర్ఎస్ పార్టీ విస్తృతస్థాయి సమావేశం జరగనుంది. పార్టీ అధ్యక్షుడు, సీఎం కేసీఆర్ అధ్యక్షతన తెలంగాణ భవన్‌లో ఈ భేటీ జరగనుంది. ఉదయం 11.30 నుంచి సాయంత్రం 4 వరకు జరిగే ఈ సమావేశంలో మున్సిపల్ ఎన్నికలపై పార్టీ నేతలకు సీఎం కేసీఆర్ దిశానిర్దేశం చేయనున్నారు. సమావేశానికి హాజరు కావాల్సిందిగా పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, జెడ్పీ చైర్మన్లు, రాష్ట్ర కార్పొరేషన్ల చైర్మన్లకు, రాష్ట్ర పార్టీ కార్యవర్గ సభ్యులు, ప్రత్యేక ఆహ్వానితులకు ఆహ్వానం పంపించారు. త్వరలోనే సిఎం కెసిఆర్‌తో సమావేశం ఉంటుందని బుధవారం మంత్రి కెటిఆర్ తెలిపారు. ఈ మేరకు పార్టీ కార్యాలయంలో ఏర్పాట్లు చేస్తున్నారు. మున్సిపల్ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న గులాబీ పార్టీ అన్ని పట్టణాలను కైవసం చేసుకునేందుకు వ్యూహం పన్నుతోంది. 2019లో జరిగిన సర్పంచ్ , జిల్లాపరిషత్, పార్లమెంట్ ఎన్నికల్లో అధిక స్థానాలు టీఆర్ఎస్ గెలుచుకున్నది. టీఆర్ఎస్ జిల్లాపరిషత్‌లన్నింటినీ గెలుచుకుని కాంగ్రెస్,బీజెపి ఉనికిని ప్రశ్నించేలా చేసింది. ఎన్నికలు ఏవైనా సిఎం కెసిఆర్‌ను ప్రజలు ఆశీర్వదిస్తూ విజయం చేకూర్చారని టిఆర్ఎస్ ధీమాగా ఉంది. టిఆర్ఎస్ ఆవిర్భవించినప్పటినుంచి నేటివరకు అత్యధిక సభ్యత్వాన్ని నమోదు చేసి, 60 లక్షల సభ్యత్వ నమోదుతో రికార్డు సృష్టించి ంది. పార్టీల కొత్తకమిటీల నిర్మాణం గ్రామ,వార్డు,పట్టణ మండల కమిటీలను 98 శాతం ఏర్పాటు చేసుకుకుని అతిపెద్ద రాజకీయపార్టీగా టిఆర్ఎస్ ఆవిర్భవించింది. ప్రస్తుతం జరగనున్న మున్సిపాలిటీ ఎన్నికల్లో జిల్లా పరిషత్ ఎన్నికల విజయం పునరావృతం అవుతుందని

కూడా పార్టీ నేతలు ధీమాగా ఉన్నారు. ఇకపోతే కొత్త జిల్లాల ఏర్పాటు తరవాత టిఆర్ఎస్ పార్టీ జిల్లాపార్టీ కార్యాలయాల నిర్మాణాలపై దృష్టి సారించింది. గతంలో కేవలం ఖమ్మంజిల్లాలోనే టిఆర్ఎస్ పార్టీ కార్యాలయం ఉండేది. ప్రస్తుతం 30 జిల్లాల్లో పార్టీ కార్యాలయాల నిర్మాణాలు దాదాపుగా పూర్తి కావస్తున్నాయి. 90 శాతం వరకు పనులు పూర్తి అయ్యాయి. సంక్రాంత్రి అనంతరం పార్టీ అధినేత, సిఎం కెసిఆర్ పార్టీ కార్యాలయాను ప్రారంభించడం ద్వారా శ్రేణుల్లో జోష్ నింపనున్నారు. మున్సిపాలిటీ ఎన్నికలకు ఇప్పటికే ఇన్‌ఛార్జీలను నియమించారు. మున్సిపాలిటీల వారిగా నివేదికలను తెప్పించుకుని అందుకు అనుగుణంగా కార్యాచరణచేస్తున్నారు. క్షేత్రస్థాయిలో టిఆర్ఎస్ నుంచి పోటీకి సిద్ధమంటున్న బలమైన నాయకులను కూడా గుర్తించారు. కొన్ని మున్సిపాలిటీల్లో టిఆర్ఎస్ నాయకుల మధ్యనే సీటును ఆశించేవారికి పోటీ ఉందని స్వయంగా వర్కింగ్ ప్రసిడెంట్ హోదాలో కెటిఆర్ప్రకటించారు. వారందరినీ ఓ దార్చి గెలిచే అభ్యర్థులకు ప్రస్తుతం పోటీ చేసే అవకాశం రాకున్నా భవిష్యత్‌లో నామినేటెడ్ పోస్టులు కల్పిస్తామని చెపుతూ ఏకాభిప్రాయం సాధిస్తున్నామని కెటిఆర్ చెప్పారు. ఇకపోతే ఇప్పటివరకు మూడు పర్యాయాలు జరిగిన పార్టీ ఆంతరంగిక సమావేశాల్లో మున్సిపాలిటీ ఎన్నికలపై మున్సిపాలిటీల వారిగా సమీక్షించి నివేదికలను రూపొంచారు. ఈనివేదికలతో పాటు క్షేత్ర స్థాయి నివేదికలను పరిశీలించిన అనంతరం, టిఆర్ఎస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, ప్రజాప్రతినిధులతో సంయుక్త సమావేశాన్ని ముఖ్యమంత్రి కెసిఆర్ అధ్యక్షతన ఏర్పాటుచేశారు. ఈసమావేశంలో సిఎం కెసిఆర్ పలు నిర్ణయాలు తీసుకోనున్నారని సమాచారం.

# 'మా' డైరీ రిలీజ్ కార్యక్రమం రసాభాస

### హీరో రాజశేఖర్‌కి వార్నింగ్ ఇచ్చిన చిరంజీవి

హైదరాబాద్,డిసెంబర్ 2 (ఆర్ఎన్ఎ): మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్(మా)లో విభేదాలు మరోసారి భగ్గుమన్నాయి. హీరో రాజశేఖర్ చేసిన వ్యాఖ్యలు మరోసారి దుమారం రేపాయి. వివాదాస్పద అంశాలకు దూరంగా ఉండే మెగాస్టార్ చిరంజీవి సైతం ఆగ్రహం వ్యక్తంచేశారు. రాజశేఖర్‌పై సీరియస్ అయ్యారు. పరిస్థితి తీవ్రతను అంచనావేసిన జీవిత స్టేజీపైనే రాజశేఖర్ తరపున క్షమాపణలు కోరారు. వివరాల్లోకి వెళితే.. 'మా' డైరీ ఆవిష్కరణలో హైదరాబాద్‌లోని ఓ ప్రముఖ హోటల్‌లో గురువారం జరిగింది. ఈ కార్యక్రమానికి సినీ రంగ ప్రముఖులు హాజరయ్యారు. ముందుగా చిరంజీవి మాట్లాడుతూ.. ఎన్ని గొడవలు ఉన్నా వాటిని మర్చిపోయి మనందరం కలిసి 'మా' అభివృద్ధికి తోడ్పడాలని పిలుపునిచ్చారు. అనంతరం రచయిత పరుచూరి గోపాలకృష్ణ మాట్లాడుతుండగా.. హీరో రాజశేఖర్ వేదికపైకి వచ్చి ఆయన చేతిలో నుంచి మైక్ లాక్కున్నారు. అంతేకాకుండా సభలో కూర్చున్న కృష్ణంరాజు, మోహన్‌బాబు, చిరంజీవి కాళ్లకు నమస్కారం చేశారు. 'మా'లో గొడవలున్నాయంటూ మరోసారి ప్రస్తావించారు. దీంతో స్టేజ్‌పై ఉన్న చిరంజీవి, మోహన్‌బాబుతోపాటు ఇతర నటీనటులు తీవ్ర అసహనానికి గురయ్యారు. మార్చిలో 'మా' కొత్త కార్యవర్గం ప్రారంభమైన నాటి నుంచి నేటి వరకూ ఒక్క సినిమా కూడా చేయలేదు. మా ఇంట్లో కూడా బాగా తిట్టారు. 'మా' కోసం ఎందుకు అంతలా పనిచేస్తున్నావ్ అన్నారు. అందరం కలిసే నడవాలని చిరంజీవిగారు చాలా బాగా మాట్లాడారు. కానీ, ఇక్కడ నిప్పును కప్పిపుచ్చితే పొగ వస్తుంది. 'మా'లో గొడవలున్నాయి. రియల్ లైఫ్‌లో హీరోగా పనిచేస్తుంటే తొక్కేస్తున్నారు' అని చెప్పారు.

దీంతో అసంతృప్తికి గురైన చిరంజీవి.. నేను చెప్పిన మాటకు ఎవరూ విలువ ఇవ్వలేదు. మా మాటలకు గౌరవం ఇవ్వనప్పుడు మేమంతా ఇక్కడ ఎందుకు ఉండాలి. ఎందుకు సభను రసాభాస చేయడం. రాజశేఖర్ మాటలను తీవ్రంగా ఖండిస్తున్నాను. ఎంతో సజావుగా సాగుతున్న సభలో ఒక గౌరవం లేకుండా ఇలా మైక్ లాక్కుని ఎలా పడితే అలా మాట్లాడడం ఏం బాగోలేదు. ఇప్పుడు కూడా నేను స్పందించకపోతే.. మీరిచ్చే పెద్దరికానికి అర్థం ఉండదు. దయచేసి దీనిని వదిలేయండి. ఎవరూ కోపావేశాలకు వెళ్లొద్దు. ఇలాంటప్పుడు ఇష్టం లేకపోతే రాకూడదు. ఇలా మాట్లాడిన వారిపై చర్యలు తీసుకోవాలి అని అన్నారు.అనంతరం వేదికపైకి వచ్చిన జీవిత క్షమాపణలు తెలిపారు. "అందరం కలిసి 'మా'ని మరింత గొప్పస్థాయికి తీసుకువెళాలని ఆమె ఆకాంక్షించారు.'మా' కార్యవర్గంలో సభ్యురాలినైనప్పటి నుంచి నేటి వరకూ నేను ఎన్నో విషయాలు తెలుసుకున్నాను. ఎందరో గొప్ప నటీనటుల వల్లే నేను ఎన్నో నేర్చుకున్నారు. అందరిలాగానే మాలో కూడా కొన్ని విభేధాలున్నాయి. గొడవలు రావడం సహజం. రాజశేఖర్, నేను 'మా'ను మరింత

### క్షమాపణలు కోరిన జీవిత

ముందుకు తీసుకువెళ్లేందుకు కృషి చేయాలనుకున్నాం. ఆయన చిన్నపిల్లాడు లాంటి వాడు. ఇలాంటి కార్యక్రమంలో ఆయన అలా మాట్లాడినందుకు క్షమిం చమని నేను కోరుతున్నాను. విబేధాలున్నా సరే డైరీ విడుదల కార్యక్రమాన్ని అందరూ కలిసి చేయాలని మెగాస్టార్ చెప్పారు. నరేష్, రాజశేఖర్ మధ్య ఎలాంటి విభేదాలు లేవు. ఇక ముందు కూడా మేమందరం కలిసి పనిచేయాలని కోరుకుంటున్నాం' అని జీవిత చెప్పారు.

### కేసీఆర్ సహకారం అందిస్తామన్నారు...

అంతకుముందు చిరంజీవి మాట్లాడుతూ.. తెలుగు చిత్ర పరిశ్రమకు సంబంధించి ఎలాంటి సహాయ సహకారాలు కావాలన్నా చేస్తామని తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ చెప్పారన్నారు. సినిమా ఇండస్ట్రీకి సంబంధించిన అన్ని వివరాలను మా డైరీలో పొందుపరిచారని, ఈ ఏడాది రెండు, మూడు ఈవెంట్లు చేయాలని సూచించారు. నాగార్జున, బాలకృష్ణ, పవన్‌కల్యాణ్, ప్రభాస్‌లతోపాటు ఇతర యువ కథానాయకులతో మాట్లాడతానని, వాళ్లు కూడా ఈవెంట్లు కోసం ఒప్పుకుంటారన్నారు. సినీ పరిశ్రమకు సంబంధించి ఎటువంటి సహాయ సహకారాలు కావాలన్నా చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు కేసీఆరే స్వయంగా చెప్పారు.

# ఆ తీర్మానం రాజ్యాంగ వ్యతిరేకం : కేరళ గవర్నర్




హైదరాబాద్, జనవరి 2: పౌరసత్వ సవరణ చట్టాన్ని వ్యతిరేకిస్తూ కేరళ రాష్ట్ర ప్రభుత్వం రెండు రోజుల క్రితం అసెంబ్లీలో తీర్మానం ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. దీనిపై ఇవాళ ఆ రాష్ట్ర గవర్నర్ ఆరిఫ్ మొహమ్మద్ ఖాన్ స్పందించారు. పౌరసత్వ అంశం కేంద్రం పరిధిలో ఉంటుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి ఆ అంశంలో ఎటువంటి పాత్ర ఉండదన్నారు. దీంతో ఈ అంశం వివాదాస్పదంగా మారింది.

సీఎం విజయన్ పాస్ చేసిన ఆ తీర్మానం రాజ్యాంగ వ్యతిరేకమని గవర్నర్ తెలిపారు. దానికి ఎటువంటి ప్రాముఖ్యత ఉండదన్నారు. తిరువనంతపురంలో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న గవర్నర్ మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వ తీర్మానాన్ని తప్పుపట్టారు. కేరళలో ఎటువంటి నిర్బంధ కేంద్రాలు లేవని కూడా సీఎం విజయన్ అసెంబ్లీలో వెల్లడించిన విషయం తెలిసిందే.

# నడుస్తున్న 'ప్రగతి'..

నేటినిజం
శుక్రవారం 3-1-2020

2024 నాటికి దేశంలో దాదాపు నూట ఐదు నగరాలలో వాయుకాలుష్యాన్ని ప్రస్తుత స్థాయి కంటే ఇరవై శాతం తగ్గిస్తారట... ఆనందకరం! జనం జీవజాలం మరింత స్వచ్ఛంగా ఊపిరి పీల్చుకొనడానికి ఈ కార్యక్రమం దోహదం చేస్తుంది.. కానీ గత నెలలో కేంద్ర ప్రభుత్వం సడలించిన నియమావళి ప్రకారం 'సముద్ర తీర నియంత్ర మండలం'- కోస్టల్ రెగ్యులేషన్ జోన్- సిఆర్‌జెడ్- పరిధిలో పరిశ్రమలను నెలకొల్పడానికి మరింత సులభం అవుతుంది. కేంద్రం నుంచి పర్యావరణ పరిరక్షణ అనుమతులను ఆయా వాణిజ్య సంస్థలు పొందనవసరం లేదు. అందువల్ల కాలుష్యాన్ని పెంచగల పరిశ్రమల స్థాపన వేగవంతం అవుతుంది. గాలి కాలుష్యం పెరుగుతుంది. ఇదీ పరస్పర వైరుధ్యం! "దీపం పెట్టి దిగనేయడం.."'సిఆర్‌జెడ్' నిబంధనలను సడలించడంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం తన అధికారాలను తగ్గించుకొంది. రాష్ట్ర ప్రభుత్వాలకు అధికారాలను పెంచింది. సముద్ర తీరం పొడవునా భూమి ఉపరితలంపై నెలకొనే పరిశ్రమల వల్ల పర్యావరణంపై ఎలాంటి ప్రభావం ఉంటుందన్న వ్యవహారం కేంద్ర ప్రభుత్వ అధికార పరిధి నుంచి తొలగిపోయింది. ఇకపై రాష్ట్ర ప్రభుత్వాలు ఈ విషయమై తుది నిర్ణయాలు తీసుకోవచ్చునట! కేంద్ర పర్యావరణ పరిరక్షణ మంత్రిత్వశాఖ వారి అనుమతులు అక్కరలేదట! ఇంతవరకు 'అభివృద్ధి' చెందని సముద్ర తీర సమీప ప్రాంతాలలో సైతం కేంద్ర ప్రభుత్వం వారి అనుమతులతో పనిలేకుండా రాష్ట్ర ప్రభుత్వాల అంగీకారంతో పరిశ్రమలను నెలకొల్పవచ్చునట! అభివృద్ధి అంటే "ఆకుపచ్చదనాన్ని హరించివేసి, పంటలను పశువులను నిర్మూలించి సిమెంటు కట్టడాలు కట్టి ఇనుప యంత్రాలను ఏర్పాటుచేయడమన్నది" దేశంలో కొనసాగుతున్న అభిప్రాయం.. 'ప్రపంచీకరణ' ముదిరిన తరువాత ఈ 'కృత్రిమ ప్రగతి భ్రాంతి' మరింత ముదిరిపోయింది. ఆవుపాలు దొరకడం ఆగిపోయిన పల్లెలలో 'కాఫీ, తేనీరు అమ్మే దుకాణాలు' నెలకొనడం గతంలో అంటే రెండు తరాలకు పూర్వం జరిగిన 'ప్రగతి'! మంచినీటి బావులు ఎండిపోయిన సీమలలో మద్యం విక్రయ కేంద్రాలు ఏర్పడుతుండడం నడుస్తున్న 'ప్రగతి'.. అందువల్ల గాలి వివిధ రకాల విష వాసనలకు నిలయంగా మారుతోంది.. స్వచ్ఛతను పునరుద్ధరించడం ఈ ద్వంద్వ విధానం వల్ల, వైరుధ్యాలు నిహితమైన విధానాల వల్ల ఎలా సాధ్యం?

సముద్ర తీరం వెంట సార్వభౌమ జలాల- టెర్రిటోరియల్ వాటర్స్-లో అంటే తీరం నుంచి పన్నెండు మైళ్లవరకు సముద్రంలోకి విస్తరించిన ప్రాంతంలోను, పర్యావరణం భయంకరంగా ఇదివరకే పాడయిన ప్రాంతాలలోను ఏర్పడే పరిశ్రమలకు మాత్రమే ఇకపై కేంద్ర ప్రభుత్వం వారి అనుమతి అవసరమట! ఇలా రాష్ట్రాలకు మరిన్ని ఆర్థిక అధికారాలను కట్టబెట్టిన కేంద్ర ప్రభుత్వం 'సమాఖ్య'- ఫెడరల్- స్ఫూర్తిని పెంచింది. కానీ కేంద్ర ప్రభుత్వం తమ అధికారాలను హరించివేస్తోందని కొన్ని రాష్ట్రాల ప్రభుత్వ నిర్వాహకులు నిరంతరం ప్రచారం చేస్తున్నారు. ఇది మన రాజ్యాంగ ప్రక్రియలో నిహితమై ఉన్న రాజకీయ వైరుధ్యం! నగరాలలోని వాయుకాలుష్యానికి ప్రధాన కారణం దశాబ్దుల తరబడి పెరిగిన, పెరిగిపోతున్న అంతస్థుల భవనాలు! ఈ వాస్తవం సామాన్య ప్రజలకు తెలుసు, మేధావులకు తెలుసు, ప్రభుత్వ నిర్వాహకులకు మరింతగా తెలుసు! నగరాలు పట్టణాలు జనావాసాలు అడ్డంగా విస్తరించడం సహజమైన ప్రగతి. మానవులు నిలువున పెరగడం అందం, చందం, ఆరోగ్యం.. కానీ నగరాలు నిలువున పెరుగుతున్నాయి. విపరీతమైన తిండి- జంక్ ఫుడ్- తిని తిని మానవులు పొట్టలు పెంచుకొని అడ్డంగా పెరుగుతుండడం- నిలువున పెరుగుతున్న నగరాలలో ఆవిష్కృతవౌతున్న జీవన దృశ్యం. ఒక ఇంటిని, దాని పక్కన ఉన్న మరో ఇంటిని- రెండిళ్లను- కూలగొట్టి అదే స్థలంలో నాలుగు అంతస్థులతో పదహారు ఫ్లాట్‌లు నిర్మిస్తున్నారు. ఫలితంగా రెండు కుటుంబాలు గాలి పీల్చి వదలిన స్థలంలో పదహారు కుటుంబాల వారు గాలిని పీల్చి వదలుతున్నారు. ఫలితంగా వాయు మండలంలో కర్బన వాయువు కేంద్రీకృతమై గాలి కలుషితం అయిపోయింది. కేంద్ర ప్రభుత్వం ఇప్పుడు మూడువందల కోట్ల రూపాయల ఖర్చుతో అమలు జరిపే వాయు ప్రక్షాళన కార్యక్రమానికి ఎక్కడికక్కడ ఈ అంతస్థుల భవనాలు విరుగుడు. ఒక వాహనం నిలిచినచోట సగటున ఐదు వాహనాలు నిలబడుతున్నాయి- ఒక వాహనం రోడ్డెక్కినచోట నగటున ఐదు వాహనాలు రోడ్డెక్కుతుండడానికి కారణం అంతస్థుల భవనాలు. ఫలితంగా వాహనాల నుండి వెలువడుతున్న వేడి పొగల వల్ల పర్యావరణం పొగ చూరిపోతోంది.. అంతస్థుల భవనాల నిర్మాణానికి ఇకనైనా ప్రభుత్వాలు అనుమతినివ్వడం మానుకున్నట్టయితే 'వాయు ప్రక్షాళన' కార్యక్రమం విజయవంతం కావచ్చు...

## పట్టణ పోరులో యువత ఆసక్తి

### ఉత్సాహంగా ప్రచార ఏర్పాట్లు

కామారెడ్డి,జనవరి2(ఆర్ఎన్ఎ): ఎన్నడూ లేని విధంగా ఈసారి మున్సిపల్ ఎన్నికల్లో యువకులు పోటీ చేసేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. రిజర్వేషన్లు ఖరారు కాకపోవడంతో వాటి కోసం ఎదురు చూస్తున్నారు. ఒకవేళ మహిళలరు రిజర్వ్ అయితే తమ భార్యలను లేదా తమ ఇంటి ఆడవారిని రంగంలోకి దింపేందుకు చాపకింద నీరుల ప్రయత్నాలు చేస్తున్నారు. మహిళలకు కేటాయించిన స్థానాల్లో భార్యలను దింపి గెలిపించుకునేందుకు భర్తలు ఇప్పటికే రంగంలోకి దిగడంతో మున్సిపల్ పోరు రసవత్తరంగా మారనుది. అసెంబ్లీ ఎన్నికలలో మరోసారి టీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి రావడంతో పార్టీ సానుభూతి పరుడిగా పోటీ చేసేందుకు అభ్యర్థులు పోటీ పడుతున్నారు. చోటా, మోటా నాయకులను మచ్చిక చేసుకుంటూ వారిద్వారా ఎమ్మెల్యేలను ఒప్పించే ప్రయత్నాల్లో అభ్యర్థులు నిమగ్నమయ్యారు. ఎన్నికల నియమావాళిని అనుసరిస్తూ ఎన్నికల సంఘం కఠిన నిబంధనలు తీసుకొచ్చింది. వీటిని ఉల్లంఘించేవారిపై కఠిన చర్యలకు ఆదేశాలు జారీ చేసింది. అభ్యర్థులను బెదిరించినా, ఎత్తుకెళ్లినా, ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తూ దొరికినా ఏడాది జైలుశిక్ష, జరిమానా విధించడంతో పాటు ఆరేండ్లు ఎలాంటి పదవులకు పోటీ చేయకుండా అనర్హత వేటు వేయనున్నట్లు ఎన్నికల సంఘం ప్రకటించింది. రానున్న మున్సిపల్ ఎన్నికల్లో టీఆర్ఎస్ ప్రభంజనం సృష్టించేలా కౌన్సిలర్లను గెలిపించుకోవాలని మంత్రి ప్రశాంత్ రెడ్డి అన్నారు. వీలైనన్ని ఏకగ్రీవాలకు ప్రయత్నించి పట్టణాల అభివృద్ధికి పాటుపడాలన్నారు. కార్యకర్తలంతా కలిసికట్టుగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. అసెంబ్లీ ఎన్నికల్లో టీఆర్ఎస్ గెలుపు కోసం శక్తి వంచన లేకుండా పని చేసిన ప్రతి కార్యకర్తకు పార్టీ అండగా ఉంటుందన్నారు. పద్నాలుగు సంవత్సరాలుగా అలుపెరుగని పోరాటం చేసి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకోవడం జరిగిందన్నారు. ఇందుకు కెసిఆర్‌కు అండగా నిలిచి ప్రతి ఒక్కరూ పంచాయితీ ఎన్నికలను ప్రతిష్టా తీసుకోవాలన్నారు. రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసుకుంటూ ముందుకు సాగడం జరుగుతుందన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులే టీఆర్ఎస్ ఎమ్మెల్యేల గెలుపునకు దోహదపడ్డాయని అన్నారు. రాష్ట్రంలో సమర్థవంతమైన పాలనను ప్రజలకు అందించేలా అందరం కలిసికట్టుగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

# బిపిన్ రావత్‌పై మహా బాధ్యత

హైదరాబాద్,జనవరి2(ఆర్ఎన్ఎ):త్రివిధ దళాలకు అధిపతిని నియమించడం ద్వారా కొత్త అడుగు పడింది. బిపిన్ రావత్ నేతృత్వంలో తొలి మహాదళం ఏర్పడింది. ఇంతకాలం త్రివిధ దళాలను సమన్వయం చేసేందుకు అవకావం లేకుండా పోయింది. కానీ తాజా నిర్ణయంతో ఇప్పుడు మన రక్షణరంగ వ్యవస్థ మారనుంది. అలాగే దేశ రక్షణకు అనువుగా నిర్ణయాలు తీసుకునే అవకావం ఏర్పడింది. ఇంతకాలం త్రివిధ దళాలకు ఏ సమస్యలు ఉన్నా విడివిడిగా ప్రధాని, రక్షణమంత్రి సమావేశం కావాల్సి వచ్చేది.

ఆ విభాగాలకు ఎదురవుతున్న సమస్య లేమిటో, వాటిని తీర్చడానికి అనుసరించాల్సిన విధానమేమిటో తెలుసు కోవాలంటే ఈ ముగ్గురితో విడివిడిగా సమావేశం కావాల్సి వచ్చేది. రక్షణ దళాల అధిపతి నియామకంతో ఆయన ఆ మూడు విభాగాలనూ పర్యవేక్షిన్తూ, వాటికి కావలసిన దీర్ఘకాలిక ప్రణాళికలు రూపొందించి, సాధికారికంగా కేంద్ర ప్రభుత్వానికి సలహాలివ్వగలుగుతారు. కార్గిల్ యుద్ధం తర్వాత ఈ సీడీఎస్ నియామకం ప్రతిపాదన తెరపైకి వచ్చింది. అందుకోసం మంత్రుల బృందాన్ని కూడా ఏర్పాటు చేశారు. అప్పట్లో త్రివిధ దళాధిపతుల మధ్య ఏకాభిప్రాయం లేక మూలనబడింది. అయితే ఉన్నతాధికార ణం కూడా అభ్యంతరం వ్యక్తం చేసిందని సమాచారం. సీడీఎస్ నియామకంతో అధికారాలన్నీ ఆయన వద్దనే కేంద్రీకృతమవుతాయని, తమ మాటకు విలువుండదని రక్షణ శాఖ ఉన్నతాధికారులు మొరపెట్టుకున్నారని చెబుతారు. కారణమేదైనా ఆ ప్రతిపాదన ఆగిపోయింది. సర్వాధికారాలూ సీడీఎస్‌లో కేంద్రీకృతమైతే ఆ పదవిలో వుండేవారు శక్తిమంతులుగా మారతారని, ఇది ప్రజాస్వామ్య వ్యవస్థకు మంచిది కాదని కొందరు వాదిస్తారు. అయితే ప్రపంచంలో 68 దేశాల్లో సీడీఎస్ వ్యవస్థ చాన్నాళ్లుగా అమల్లోవుంది. యుద్ధ సమయాల్లో ఎదురవుతున్న ఇబ్బందులు గుర్తించాకే అవన్నీ సీడీఎస్‌కు మొగ్గుచూపాయి. పైగా ఇప్పుడు సైనిక రంగంలో పెనుమార్పులు చోటు చేసుకున్నాయి. యుద్ధ రీతులు పూర్తిగా మారాయి. వేగంగా ముగిసే మెరుపు యుద్ధాలు, పరిమిత కాలంపాటు మాత్రమే కొనసాగే ఘర్షణలు రివాజయ్యాయి. అణ్వాయుధాలు సరే... రిమోట్ కంట్రోల్ ఆయుధాలు, డ్రోన్‌లద్వారా లక్ష్యాలు ఛేదించడం, కృత్రిమ మేథతో పని చేసే స్వయంచాలిత ఆయుధాలు రంగంలో కొచ్చాయి.

అయితే అప్పటినుంచీ అడపా దడపా రక్షణ నిపుణులు దీనిపై పునరాలోచించమని ప్రభుత్వాన్ని కోరుతూనేవున్నారు. ప్రస్తుతం త్రివిధ దళాల కమిటీ ఒకటి పనిచేస్తోంది. ఇకపోతే యుద్ధం వచ్చే పక్షంలో శత్రువును సమర్థవంతంగా ఎదుర్కొనడానికి అనువుగా రక్షణ దళాలను తీర్చిదిద్దడం, వాటికి అవసరమైన సమస్త సరంజామా, యుద్ధ అవసరాలను అందుబాటులో ఉంచడం ఏ దేశానికైనా తప్పనిసరి. యుద్ధ నిపుణుల అభిప్రాయం ప్రకారం శత్రువే చాలాసార్లు యుద్ధాన్ని నిర్ణయిస్తాడు. కనుకనే మన త్రివిధ దళాలను స్వతంత్రంగా పర్యవేక్షించడానికి రక్షణ దళాల అధిపతి చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ సీడీఎస్‌ని నియమించాలని కేంద్ర మంత్రివర్గం తీసుకున్న నిర్ణయం మేరకు అది అమల్లోకి తీసుకుని వచ్చారు. ఆర్మీచీఫ్‌గా పదవీ విరమణ చేసిన బిపిన్ రావత్ తొలి చీఫ్‌గా కూడా నియమితులయ్యారు. స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటించినప్పుడు అనేకమంది దాన్ని స్వాగతించారు. ఇంతకాలం త్రివిధ దళాల అధిపతులు ఎవరికివారు వారివారి విభాగాల నిర్వహణలో తలమునకలై ఉంటూ సమస్య వచ్చినప్పుడు ప్రధాని లేదా రక్షణ మంత్రితో చర్చించే వారు.

ఇప్పుడా అవసరం ఉండదు. వారు తమ చీఫ్‌కు సమస్యను వివరించడంతో పాటు అతడిచ్చే ఆదేశాల మేరకు నడుచుకోవాల్సి ఉంటుంది. ఇప్పుడున్న విధానంలో సైన్యం, వైమానికదళం, నావికాదళం ఈ మూడూ ఖరారు చేసే ప్రతిపాదనలు రక్షణ కార్యదర్శి వద్దకు వెళ్లడం, దానిపై ఆయన తన అభిప్రాయాన్ని జోడించి రక్షణమంత్రికి ఇవ్వడం, చివరిగా అత్యున్నత స్థాయిలో తుదినిర్ణయం తీసుకోవడం వంటివి జరుగుతున్నాయి. అయితే రక్షణ దళాల అవసరాలను అర్థం చేసుకుని, ప్రభుత్వం వాటిని తీర్చే క్రమంలో ఉన్నతాధికార వ్యవస్థ పెను అడ్డంకిగా వున్నదని త్రివిధ దళాల్లో ఎప్పటినుంచో అసంతృప్తి వుంది. జవాన్లకు మెరుగైన ఆయుధాలు, వాహనాలు, ఇతర సామగ్రి సకాలంలో సమకూరడానికి ఉన్నతాధికార గణం ఆమోదం తప్పనిసరి కావడం, వారు క్షేత్రస్థాయి స్థితిగతుల్ని పరిగణన లోకి తీసుకోకుండా జాప్యం చేయడం పెను సమస్యగా వున్నదని రక్షణ సిబ్బంది తరచు ఫిర్యాదు చేస్తున్నారు. వాస్తవానికి తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ హయాంలోనే సీడీఎస్ ప్రతిపాదన చర్చ కొచ్చిందని సమాచారం. ఆఖరి గవర్నర్ జనరల్‌గా పనిచేసిన లార్డ్ మౌంట్‌బాటన్ నెహ్రూతో దీన్ని ప్రస్తావించినా ఆయన సుముఖత వ్యక్తం చేయలేదని అప్పట్లో విమర్శలు కూడా వచ్చాయి. అప్పటి సైనిక దళాల ప్రధానాధికారి జనరల్ కె.ఎస్. తిమ్మయ్యను సీడీఎస్‌గా నియమిస్తే బాగుంటుందని కూడా ఆయన సూచించారట. కానీ జనరల్ తిమ్మయ్య విషయంలో నెహ్రూకు అభ్యంతరం వుండటం వల్ల కావొచ్చు... ఆయన అందుకు అంగీకరించలేదని అంటారు. దాని పర్యవసానాలు 1962 చైనా యుద్ధంలో దేశం చవిచూసింది. అప్పట్లో త్రివిధ దళాల మధ్య సమన్వయ లోపంతో స్వల్పకాలంలోనే ఓటమి చవిచూడాల్సి వచ్చింది. అయితే సీడీఎస్ పదవి సృష్టించడంతో ఇప్పుడు సమన్వయం సులువు కానుంది. అలాగే సైనిక దళాల వ్యవస్థను ఆధునీకరించే అవకాశం ఏర్పడింది. దళాల అన్నిటి మధ్యా సమన్వయం సాధించేలా, ఒకే కమాండ్ కింద పనిచేసేలా పునర్వ్యవస్థీకరించడం అవసరం. రక్షణ దళాలను ఆధునీకరించాల్సిన అవసరం కూడా ఉంది. భద్రతకు సంబంధించిన అంశాల్లో త్వరితగతిన నిర్ణయాలు తీసుకుంటూ ముందుచూపుతో వ్యవహరించగల పటిష్టమైన వ్యవస్థ రూపొందిచి దేశాన్ని శత్రుదుర్భేద్యంగా మార్చుకోవడంఅవసరం. పాక్, చైనాల నుంచి పొంచి ఉన్న ముప్పులకు అనుగుణంగా మార్పులు తీసుకోవాలి. సమర్థుడైన అధికారికగా పేరున్న బిపిన్ రావత్ ఆ పని చేస్తారనడంలో సందేహం లేదు.

## జగిత్యాలలో మున్సిపల్ వేడి

### ప్రచారంలో ముందున్న టిఆర్ఎస్ ఎమ్మెల్యేలు
### కార్యకర్తలకు దిశానిర్దేశం చేస్తూ ముందుకు

జగిత్యాల,జనవరి2(ఆర్ఎన్ఎ): జగిత్యాల జిల్లాలో ఉన్నమూడు మున్సిపాలిటీలపై గులాబీ జెండా ఎగురేయాలన్న పట్టుదలతో నేతలు పావులు కదుపుతున్నారు. జగిత్యాల, కోరుట్ల,మెట్‌పల్లి,ధర్మపురి, రాయపట్నం మున్సిపాలిటీపై గులాబీ జెండా ఎగరవేస్తామని స్థానిక ఎమ్మెల్యే ప్రకటించారు. ఈ మేరకు తమ పరిధిలోని పట్టణాలపై వీరు దృష్టి సారించారు. మున్సిపల్ ఎన్నికల్లో గెలుపు గుర్రాలకే పార్టీ టికెట్లు కేటాయిస్తామని చెప్పారు. టిఆర్ఎస్‌తోనే పట్టణాభివృద్ధి సాధ్యమవుతుందని ఇప్పటికే ఎమ్మెల్యేలు డాక్టర్ సంజయ్‌కుమార్, విద్యాసాగర్రావులు పేర్కొన్నారు. మున్సిపాలిటీ ఎన్నికలను పురస్కరించుకొని టీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో ఎన్నికల సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీఆర్ఎస్ సెక్యులర్ పార్టీ అని, పార్టీకి అన్ని మతాలూ సమానమేనని, దేశం కోసం, రాష్ట్రం కోసం పార్టీ పనిచేస్తున్నదని స్పష్టం చేశారు. ప్రజలు ప్రతిపక్షాలను తిరస్కరించారని, వారికి ఓట్లడిగే నైతిక హక్కు లేదని, ప్రజలను ఓట్లడిగే హక్కు కేవలం టీఆర్ఎస్‌కే ఉందన్నారు. జగిత్యాల నుంచే జైత్రయాత్ర కొనసాగిస్తామని డాక్టర్ సంజయ్ తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత సీఎం కేసీఆర్ జగిత్యాలను జిల్లా చేసి తెలంగాణ ముఖచిత్రంలో మొదటి స్థానం కల్పించారన్నారు. జిల్లా కార్యాలయ భవన నిర్మాణాలకు రూ.50కోట్లు కేటాయించారని చెప్పారు. గతంలో మంజూరైన నర్సింగ్ కళాశాల నిర్మాణానికి అప్పటి నాయకులు స్థలాన్ని కూడా కేటాయించలేదన్నారు. తాను ఎమ్మెల్యేగా గెలిచాక కల్వకుంట్ల కవిత సహకారంతో రూ.16కోట్ల నిధులు మంజూరు చేయించానన్నారు. పొలాస వ్యవసాయ పరిశోధనా స్థానంలోని హాస్టల్ భవన నిర్మాణానికి రూ.22కోట్లు, మాతాశిశు సంరక్షణ కేంద్రం ఏర్పాటుకు రూ.30 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు.జగిత్యాల పట్టణంలోని రోడ్లు, డ్రైనేజీ, తదితర నిర్మాణాలకు రూ.50కోట్ల మంజూరు చేశామన్నారు. జగిత్యాల పట్టణంలోని శ్మశాన వాటికల అభివృద్ధికి రూ.1.30కోట్ల నిధులు కేటాయించామని, అభివృద్ధి పనులు ప్రారంభమయ్యాయన్నారు. టీఆర్‌నగర్‌లో రూ.2.50కోట్లతో డంప్‌యార్డు నిర్మాణం ఏర్పాటు చేశామన్నారు. టీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని నాయకులు, కార్యకర్తలకు సూచించారు. మున్సిపల్ వార్డు కౌన్సిలర్ల టికెట్లను కమిటీల ద్వారానే కేటాయిస్తామని, పార్టీ నిర్ణయానికి అందరూ కట్టుబడి ఉండాలన్నారు. అలాగే మున్సిపల్ ఎన్నికల్లో విజయం కోసం ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరుట్ల ఎమ్మెల్యే విద్యాసాగర్ రావు అన్నారు.

జిల్లాలోని ఐదు మున్సిపాలిటీల్లో విజయం సాధించి సత్తా చాటాలని అన్నారు. టీఆర్ఎస్ ప్రభుత్వం కార్మిక సంక్షేమానికి కృషి చేస్తుందని పేర్కొన్నారు. ఇందులో భాగంగా మత్స్య కార్మికులకు చెరువులను అభివృద్ధి చేసి చేప పిల్లలను ఉచితంగా అందించిందని, 75శాతం సబ్సిడీతో వివిధ రకాల వాహనాలను అందించిద ని గుర్తు చేశారు. గీతా కార్మికులకు ఉన్న ఎక్స్‌గ్రేషియాను రూ.5లక్షలకు పెంచిందని, ఆటో, ట్రాక్టర్లకు టాక్సీ రద్దు చేసిన ఘనత టీఆర్ఎస్ సర్కారుకే దక్కుతుందన్నారు. ఆటో డ్రైవర్లకు రూ.5లక్షల ఇన్సూరెన్స్ పథకాన్ని ప్రవేశపెట్టామని, భవన కార్మికులకు గతంలో రూ.2లక్షల ఎక్స్‌గ్రేషియాను రూ.6 లక్షలకు పెంచామని చెప్పారు. ఎన్నికలు ఇప్పుడే వద్దంటూ ప్రతిపక్షాలు కోర్టుల చుట్టూ తిరుగుతు న్నాయని, ఎన్నికలంటే ప్రతిపక్షాల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుతో ఎక్కువ లాభపడేది జగిత్యాల జిల్లానేనని, వ్యవసాయ రంగానికి ముఖ్యమంత్రి పెద్దపీట వేశారన్నారు.

## నిర్భయ దోషులకు ఉరిశిక్షపై 7న తీర్పు

న్యూఢిల్లీ,జనవరి2(ఆర్ఎన్ఎ): నిర్భయ దోషుల భవితవ్యంఈ నెల 7న తేలనుంది. ఉరిశిక్ష అమలుపై కోర్టు ఉత్తర్వులు ఇస్తే అమలుచేయడానికి తీహార్ జైలులో సర్వం సిద్ధం చేశారు. వీరి ఉరిశిక్షపై 7వ తేదీన డెత్ వారెంట్‌లపై ఢిల్లీ పటియాల కోర్టు తీర్పు వెలువరించనుంది. ఢిల్లీలో నిర్భయపై దారుణంగా గ్యాంగ్ రేప్ చేసి, పాశవికంగా వ్యవహరించి ఆమె హత్యకు కారణమైన ఘటనలో నిర్భయ దోషులందర్నీ ఒకేసారి ఉరి తీయనున్నారు. ఈ మేరకు తీహార్ జైల్లో నాలుగు ఉరికంభాలను అధికారులు సిద్ధం చేశారు. ఆ ఉరికంబాలతో పాటు నాలుగు సొరంగాలను కూడా నిర్మించారు. నిర్భయ దోషులైన పవన్, ముఖేశ్ సింగ్, అక్షయ్ ఠాకూర్, వినయ్‌కి ఒకేసారి ఉరిశిక్ష అమలు చేయనున్నారు. కాగా, డిసెంబర్ 16, 2012లో నిర్భయపై కదులుతున్న బస్సులో ఆరుగురు గ్యాంగ్ రేప్ కు పాల్పడ్డారు. ఆతర్వాత బాధితురాల్ని నడిరోడ్డుపై పడేశారు. దీంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ 13రోజుల పాటు పోరాడిన నిర్భయ చివరకు ప్రాణాలు విడి చింది. ఆమె బాయ్ ఫ్రెండ్ కూడా తీవ్ర గాయాలపాలై ప్రాణాలతో బయటపడ్డాడు. ఈ కేసులో మొత్తం ఆరుగుర్ని దోషులుగా గుర్తించగా వారిలో ఒకడు తీహార్ జై ల్లో ఆత్మహత్య చేసుకున్నాడు. మరొక వ్యక్తి మైనర్ కావడంతో జువెనైల్ చట్టాల ప్రకారం మూడేళ్ల జైలు శిక్ష తర్వాత రిలీజ్ అయ్యాడు. మిగతా నలుగురూ తీహార్ జైల్లో ఉన్నారు.

## వేములవాడలో ఏకాదశికి ప్రత్యేక ఏర్పాట్లు

### భక్తుల రద్దీకి అనుగుణంగా చర్యలు

వేములవాడ,జనవరి2(నేటినిజం ప్రతినిధి): వేములవాడ రాజరాజేశ్వరస్వామి దేవస్థానంలో ఈ నెల 6వ తేదీన ముక్కోటి ఏకాదశి వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని ఏర్పాట్లు చేస్తున్నారు. తెల్లవారుజామున 3-00 గంటలకు మంగళవాయిద్యములు, 3-10 గంటలకు సుప్రభాత సేవ, 3-35 గంటలకు సుప్రభాత దర్శనం, 3-50 గంటల నుంచి ప్రాతఃకాల పూజ, 5-00గంటలకు స్వామివారల పల్లకీసేవ నిర్వహిస్తారు. అనంతరం ఉదయం 5.10 గంటల నుంచి పార్వతీరాజరాజేశ్వరస్వామివారు, లక్ష్మీఅనంతపద్మనాభస్వామివారలు పల్లకీసేవపై ఉత్తర ద్వారం వద్ద భక్తులకు దర్శనమిస్తారు. అనంతరం తూర్పు భాగములోని రాజగోపురం వద్ద ముక్కోటి ఏకాదశి విశిష్టత, ప్రవచనము, మహాహారతి, ప్రసాద వితరణ వంటి కార్యక్రమాలు ఉంటాయి. ఇదిలావుంటే ఆంగ్ల నూతన సంవ టత్సరం సందర్భంగా వేములవాడ రాజరాజేశ్వర క్షేత్రం బుధ,గురువారాల్లో సంద టడిగా మారింది. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులతోపాటు స్థానికులు పెద్ద సంఖ్యలో రాజరాజేశ్వరస్వామిని దర్శించుకున్నారు. భక్తుల రద్దీ అనూహ్యంగా పెరగడంతో అధికారులు లఘుదర్శనం అమలు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారికి కోడెమొక్కు చెల్లించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు. వరుసగా రెండోరోజు కూడా భక్తులు భారీగా తరలి వచ్చారు.

## అక్షర తెలంగాణ వైపు నడిపించడమే ధ్యేయం

### హైదరాబద్ బుక్‌ఫెయిర్ అధ్యక్షులు జూలూరి

హైదరాబాద్,జనవరి 2(ఆర్ఎన్ఎ): తెలంగాణ రాష్ట్రాన్ని అక్షర తెలంగాణ వైపు నడిపించడమే హైదరాబాద్ బుక్ ఫెయిర్ సొసైటీ ధ్యేయమని నిర్వాహకులు తెలిపారు. గడిచిన డిసెంబర్ 23వ తేదీ నుంచి జనవరి 1వ తేదీ వరకు నగరంలోని తెలంగాణ కళాభారతి ప్రాంగణంలో హైదరాబాద్ బుక్ ఫెయిర్ జరిగిన విషయం తెలిసిందే. బుక్ ఫెయిర్‌పై నిర్వహకులు జూలూరి గౌరీశంకర్ దితరులు మాట్లాడుతూ.. బుక్ ఫెయిర్ పుస్తకాల అమ్మకాలకే పరిమితం కాలేదన్నారు. బాల మేళాలు, పుస్తకావిష్కరణలతో సాహితీ సంగమంగా నిలిచిందన్నారు. జాతీయ పుస్తక ప్రదర్శనను 8.5 లక్షల మంది సందర్శించినట్లు తెలిపారు. గత ఐదేళ్లలో 50 లక్షల మంది బుక్ ఫెయిర్‌ను సందర్శించినట్లు చెప్పారు. రాష్ట్ర రాజధానికే పరిమితం కాకుండా గ్రామ, మండలస్థాయికి పుస్తక ప్రదర్శనల్ని తీసుకెళ్తామన్నారు. ఈ ఏడాది 33 జిల్లాల్లో పుస్తక ప్రదర్శనలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

# నిరంతర వ్యవసాయ విద్యుత్ ఓ విజయగాథ

### రెండేళ్లుగా రైతులకు వరంగా మారిన పథకం
### విమర్శకులకు చెంపపెట్టుగా పథకం అమలు
### దేశానికి ఆదర్శంగా నిలిచిన నిరంతర విద్యుత్ పథకం

హైదరాబాద్,జనవరి2 (ఆర్ ఎన్ఎ):రెండేళ్లు రెండు క్షణాల్లా గడిచాయి. నిరంతర వ్యవసాయ విద్యుత్‌కు ఆటంకం లేకుండా అందుతోంది. ఎన్ని రోజులు ఇస్తారో చూద్దామని విపక్షాలు అనుకుంటున్న వేళ కాలం గిర్రున తిరిగింది. 2018 నూతన సంవత్సరం ప్రవేశించిన శుభ సందర్భంగా మొదలైన కార్యక్రమం నిరంతరయాంగా సాగుతోంది. దేశానికి వెలుగుదివ్వెలా ఇప్పుడు తెలంగాణ కనిపిస్తోంది. పక్కరాష్ట్రం ఎపిలో కరెంట్ కోతలతో అల్లాడుతుంటే మనం మాత్రం నిరంతరాయంగా వ్యవసాయానికి, గృహావసరాలకు విద్యుత్‌ను అందుకుంటున్నాం. ఉమ్మడి పాలనలో దశాబ్దాల తరబడి అలుముకొన్న చీకట్లను చీల్చివేసి విద్యుత్ కాంతులను ప్రసరింప జేయాన్న ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు స్వప్నం సాకారమై, నిరంతరాయంగా కొనసాగడం ఓ అద్భుత విజయంగా చూడాలి. నిరంతర విద్యుత్‌తో ఇప్పుడు లక్షల రైతు కుటుంబాల్లో ఆనందం నిండింది. పొలాల గట్లపై విద్యుత్ కోసం ఎదురుచూసే రోజులు పోయాయి. వ్యవసాయానికి ఇరవైనాలుగు గంటలపాటు నిరాఘాటంగా విద్యుత్ సరఫరా ప్రారంభమై అప్పుడే రెండేళ్లుపూర్తి చేసుకోవడం ఓ ఘనవిజయంగా చూడాలి.

2018 నూతన సంవత్సరపు ఉషోదయ కిరణాలు భూమిపై మెరువకముందే తెలంగాణ పంటపొలాల్లో విద్యుత్ వెలుగులు విరజిమ్మాయి. రాష్ట్రంలోని 23లక్షల వ్యవసాయ కనెక్షన్లకు 24 గంటల కరంట్ సరఫరాను విద్యుత్ సంస్థలు సగర్వంగా ప్రారంభించాయి. దేశ చరిత్రలో ఏ రాష్ట్రమూ చేయలేని పనిని తెలంగాణ ప్రభుత్వం చేసి చూపించింది. విడిపోతే తెలంగాణ అంధకారంలో మగ్గి పోతుందన్న వారికి చెంపపెట్టుగా రాష్ట్రం ఏర్పడిన మూడున్నరేండ్లలోనే అన్ని రంగా లతోపాటు వ్యవసాయానికి సైతం నిరంతర ంగా నాణ్యమైన విద్యుత్‌ను ఇచ్చి రికార్డు సృష్టించింది. ఇప్పటికే అభివృద్ధిపరంగా, సంక్షేమపరంగా అనేక రంగాలలో దేశంలోనే నంబర్ 1గా నిలిచిన తెలంగాణ, రైతాంగానికి సమృద్ధిగా విద్యుత్‌ను అందించి.. అన్ని రాష్ట్రాలకూ మార్గదర్శకంగా నిలిచింది. అన్ని జిల్లాల్లో స్థానిక విద్యుత్ ఇంజినీర్లు, అధికారులుకూడా నిరంతర విద్యుత్‌ను పరిశీలిస్తూ.. సిబ్బందికి అవసరమైన సూచనలు అందిస్తూ..

అందరినీ ఉత్సాహప రుస్తూ.. ఛాలెంజ్‌ను కొనసాగిస్తున్నారు. రానున్న డిమాండ్‌ను అంచనా వేస్తూ.. ఎప్పటికప్పుడు తగిన చర్యలను ఉన్నతాధికారులు చేపట్టారు. వ్యవసాయానికి నిరంతర సరఫరా కోసం ప్రత్యేకంగా 7500 మెగావాట్ల విద్యుత్‌ను అందుబాటులో ఉంచారు. తెలంగాణ తాను పుట్టడానికి ముందే.. ఎందుకు పుడుతున్నదో తెలుసుకొని ఆవిర్భవించింది. ఐదున్నరేండ్ల చిన్న జీవితంలో అత్యంత ఆత్మవిశ్వాసంతో అడుగుపెట్టింది. ఎన్నో సంక్షేమ పథకాలు.. మరెన్నో అభివృద్ధి ప్రణాళికలు.. అన్ని వర్గాలు.. అన్ని కులాలు.. అన్ని మతాలు.. అన్ని రంగాలు.. ప్రతి ఒక్కరి ఆకాంక్షను నెరవేర్చే దిశలో ఎన్నో చర్యలు.. తెలంగాణలో ఏ పథకం చేపట్టినా రికార్డే. యావత్ దేశానికి ఆదర్శమే. ప్రపంచ దేశాలు సైతం అబ్బురపడిన మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ తెలంగాణకు మాత్రమే సాధ్యమైనవి. మరే రాష్ట్రంలో లేనివిధంగా వ్యవసాయానికి 24గంటల విద్యుత్ పథకాన్ని ప్రారంభించి రెండేళ్లుగా రైతుల లోగిళ్లలో తెలంగాణ ప్రభుత్వం వెలుగులు నింపుతోందంటే అది నాయకుడి ప్రతిభ తప్ప మరోటికాదు. ఈ ఆనందం తెలంగాణ వ్యవసాయాన్ని సుసంపన్నం చేస్తూనే ఉంది. నీటి లభ్యత, నిరంతరకరెంట్ కారణంగా పంటల దిగుబడి పెరిగింది. ప్రతిష్ఠాత్మక కాళేశ్వరం వంటి ప్రాజెక్టులు తెలంగాణ మాగాణాలను సుసంపన్నం చేయబోతున్నాయి. బంగారు తెలంగాణ దిశగా నిర్ణయాత్మక అడుగులు పడ్డాయనడానికి ఇంతకన్నా నిదర్శనం ఉండబోదు. అందుకు కెసిఆర్ అభినందనీయుడు.

## ఉమ్మడి జిల్లాలో సత్తా చాటుతాం

### మున్సిపల్ ఎన్నికల్లో బిజెపి బలమేమిటో చూపిస్తాం
### కెటిఆర్ వ్యాఖ్యలు పట్టించుకునేది లేదు: బండి

కరీంనగర్,జనవరి2(నేటినిజం ప్రతినిధి): కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో ఉన్నమున్సిపాలిటీల్లో బిజెపి సత్తా చాటుతుందని కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్ అన్నారు. బిజెపి ఎక్కడా లేదన్న మంత్రికెటిఆర్ వ్యాఖ్యలపై ఎంపి మండిపడ్డారు. నాలుగు ఎంపి సీట్లు కోల్పోయినా వారు కళ్లుతెరవలేదన్నారు. రానున్న మున్సిపల్ ఎన్నికల్లోసత్తా చాటి తామేంటోమారు చూపిస్తామని అన్నారు. ఎంఐఎం ఫ్రెండ్లీ పార్టీ అంటున్న టిఆర్ఎస్, వారితో మిలాఖత్ అయ్యారని అన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో టీఆర్ ఎస్‌కు ఓటేస్తే ఎంఐఎంకు వేసినట్లే అవుతుందని హెచ్చరించారు. సీఏఏ బిల్లు ఆమోదం పొంది నెలరోజులు అవుతుండగా ఇన్నాళ్లు

స్పందించని టీఆర్ఎస్, ఎంఐఎం పార్టీలు తమ ఓటు బ్యాంక్ కోసం, మున్సిపల్ ఎన్నికలలో లబ్ది పొంద డానికి ప్రయత్నిస్తున్నాయని ఆయన ఆరోపించారు. టీఆర్ఎస్, ఎంఐఎం పార్టీలకు ఓటేసి గెలిపిస్తే తెలంగాణ ప్రజలు సీఏఏకు వ్యతిరేకమని దేశమంతా ప్రచారం చేసే అవకాశం ఉందని, ప్రతీ భారతీయుడు మున్సిపల్ ఎన్నికల్లో బీజేపికి ఓటు వేయాలని కోరారు. ఆర్టికల్ 370, ట్రిపుల్ తలాఖ్ రద్దు అనంతరం దేశంలో మత విద్వేశాలు, విధ్వంసాలను కాంగ్రెస్, కమ్యూనిస్టు, టీఆర్ఎస్, ఎంఐఎం పార్టీలు కోరుకున్నాయని చెప్పారు. మున్సిపల్ ఎన్ని కల్లో బీజేపీ గెలుపునకుప్రతీ కార్యకర్త కృషి చేయలని పిలుపునిచ్చారు. ఈ ఎన్నికల్లో టీఆర్ఎస్, ఎంఐఎంలు ఎన్ని డబ్బులు ఖర్చు పెట్టినప్పటికీ ఓటమి తప్పదన్నారు. ఎన్నికల హామీలను నిలబెట్టుకోలేని ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్వాసితుల కన్నీళ్లతో మిడ్ మానేరు ప్రాజెక్టును నింపారని బండి సంజయ్‌కుమార్ అన్నారు.తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిని స్వాగతిస్తూ కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించిన పర్యావరణ అనుమతులను వెంటవెంటనే ఇచ్చిందని, ముఖ్యమంత్రి కేసీఆర్, టీఆర్ఎస్ నాయకులు వీటన్నింటిని మరిచిపోయి ప్రజలను మోసం చేయాలనే ఆలోచన చేస్తున్నారని విమర్శించారు. గతంలో సీఎం కేసీఆర్ వేములవాడ రాజరాజేశ్వర స్వామి దర్శనానికి వచ్చి మిడ్ మానేరు నిర్వాసితులకు ఇచ్చిన హామీలను మరిచిపోయారని అన్నారు. అనుపురంలో 57 మంది, సంకెపల్లిలో 16 మంది, చీర్లవంచలో 102 మందికి ఇంత వరకు పరిహారం ఇవ్వలేదన్నారు. రూ.5 లక్షల నగదు, డబుల్ బెడ్‌రూంల హామీలు నెరవేర్చలేదన్నారు. పేదలను ప్రాజెక్టుల పేరుతో మోసం చేస్తున్నారని, 12 ఏళ్లుగా మిడ్ మానేరు నిర్వాసితులు ఇబ్బంది పడతున్నా సీఎం భరోసా కూడా ఇవ్వడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మిడ్ మానేరు నిర్వాసితులు తిరగబడాలని, మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీకి మద్దతు తెలపాలని పిలుపునిచ్చారు. అసదుద్దీన్ ఓవైసీ, సీఎం కేసీఆర్‌లు లోపాయకారి ఒప్పందం చేసుకున్నారని ఆరోపించారు. ఎంఐఎం పార్టీకి టీఆర్ఎస్ ప్రభుత్వం నిధులు సమకూరుస్తోందని, మత విద్వేశాలు సృష్టించడానికి ప్రయత్నిస్తోందని అన్నారు. జిల్లా ప్రజలు ఐక్యతను ప్రదర్శించి గత పార్లమెంట్ ఎన్నికల్లో తనను ఎంపిగా గెలిపించారన్నారు. టీఆర్ఎస్ ప్రభుత్వం ఓటు బ్యాంక్ రాజకీయాలకు పాల్పడుతోందని ఆరోపించారు. మరోసారి నిజాం పాలన తీసుకురావాలని టీఆర్ఎస్ చూస్తోందని అన్నారు. కేంద్రంనుంచి నిధులు వస్తున్నా టీఆర్ఎస్ ప్రభుత్వం ధన్యవాదాలు కూడా చెప్పడంలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వ వాటా ఇవ్వకుండా కేంద్రం నిధులతోనే అభివృద్ధి పనులను చేస్తోందన్నారు. ప్రజాస్వామ్యంగా తెలంగాణను ఏర్పాటు చేసుకోవాలని, మున్సిపల్ ఎన్నికల్లో టీఆర్ఎస్‌కు ఓటు వేస్తే ఎంఐఎంకు వేసినట్లేనని అన్నారు.

# మున్సిపాలిటీల్లో రాజుకుంటున్న వేడి

### అభ్యర్థిత్వాల ఖరారయితే మరింత జోరు

ఖమ్మం,జనవరి2(ఆర్ఎన్ఎ): మున్సిపల్ ఎన్నికల షెడ్యూల్ విడదల కావడంతో ఉభయ జిల్లాల్లోని మున్సిపాలి టీల్లో వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. ఇన్నాళ్లు ఎన్నికల చర్చలో కాలం గడిపిన ప్రజలు ఇప్పుడు అభ్యర్థిత్వాల ఖరారు, మద్దతు కూడగట్టే పనిలో నిమగ్నమయ్యారు. ఒకే విడతలోల్లో ఎన్నికలు నిర్వహిస్తుండటంతో వివిధ పార్టీల శ్రేణులు సన్నద్ధం అవుతున్నాయి. తమ విధేయులకే పెద్దపీట వేసి గెలిపించు కోవడానికి కసరత్తు ప్రారంభించారు. రానున్న రోజుల్లో మరింత వేడెక్కనుంది. మున్సిపల్,వార్డు కౌన్సిలర్ల ఎన్నికలకు సంబంధించిన నోటిఫికేషన్ విడుదలైంది. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో ఎన్నికలు నిర్వహించనున్నారు. ఆయా స్థానాలకు రిజర్వేషన్లు ఖరారు చేయాల్సి ఉంది. చలికాలంలో ఎన్నికల వేడిని రాజేసింది. ఇదిలావుంటే ప్లాస్టిక్ రహిత ఖమ్మానికి నగర ప్రజలందరూ సహకరిం చాలని కలెక్టర్ ఆర్‌వీ కర్ణ న్ పిలుపునిచ్చారు. ఖమ్మం నగరాన్ని పూర్తిగా మిషన్ ప్లాస్టిక్ రహితంగా మార్చేందుకు చేపట్టిన కార్యక్రమంలో భాగంగా ఇప్పుడు ఆశావహ అభ్యర్థులు కూడా ఇదే ప్రచారం చేపట్టారు. ప్లాస్టిక్ వస్తువులకు బదులుగా మొక్కతో పాటు క్లాత్‌బ్యాగులను అందజేస్తున్నారు. నగరంలో ఇటీవల వాణిజ్య వ్యాపార సంస్థలతో సింగిల్‌యూజ్ ఎ÷-లాస్టిక్‌ని పూర్తిగా నిషేధం చడం జరిగిందని, ప్రజలు కూడా చైతన్యవంతులై ప్లాస్టిక్‌కు బదులుగా ప్రత్యామ్నాయ వస్తువులను వినియోగి స్తున్నారన్నారు. ప్లాస్టిక్ మార్పిడి కార్యక్రమం లో భాగంగా ఒక కేజి ప్లాస్టిక్‌కు బదులుగా ఒక క్లాత్‌బ్యాగ్, ఒక మొక్కను, అదే విధంగా 3 కేజీల ప్లాస్టిక్‌కు బదులుగా ఒక క్లాత్ బ్యాగ్‌తో పాటు ఒక ఫుడ్ కూపన్ అందిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. మొత్తంగా ప్లాస్టిక్ నిషేధం కూడా ప్రచారంలో భాగం కానున్నది.

## మార్క్‌ఫెడ్ ద్వారా కందుల కొనుగోళ్లు

మహబూబ్‌నగర్,జనవరి2(ఆర్ఎన్ఎ): రైతులు పండించిన కందులను మార్క్‌ఫెడ్ ద్వారా ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి చెప్పారు. పండించిన ప్రతిగింజను ప్రభుత్వ మద్దతు ధరకు కొనుగోలు చేస్తామని పేర్కొన్నారు. కందికి మద్దతు ధర చెల్లించి రాష్ట్రంలో దళారీ వ్యవస్థకు చెక్ పెట్టేందుకు టీఆర్ఎస్ ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. సీఎం కేసీఆర్ రైతు పక్షపాతిగా పేర్కొన్నారు. రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా కొనుగోలు తేదీలను ప్రకటించేందుకు ముందస్తుగా టోకెన్లు అందించాలని నిర్వాహకులను ఆదేశించారు. కొనుగోలు కేంద్రం వద్ద అక్రమాలకు పాల్పడితే సహించేది లేదని హెచ్చరించారు. రోజు వారిగా కొనుగోలు చేసిన కందుల వివరాలను తనతో పాటు ఉన్నతాధి కారులకు తెలపాలన్నారు.

# గ్రామాలకు ఇక పక్కా ప్రణాళిక

హైదరాబాద్, జనవరి 2:గ్రామాల అభివృద్ధి లక్ష్యంగా, స్వచ్ఛ గ్రామాలను తయారు చేసుకోవాలన్న సంకల్పంతో చేపట్టిన పల్లె ప్రగతి కార్యక్రమం మరోమారు నేటినుంచి తెలంగాణలో చేపట్టబోతున్నారు. ప్రజలను గ్రామాల అభివృద్ధిలో భాగస్వాములను చేయడం, గ్రామాల పారిశుద్యానికి ప్రాధాన్యం ఇవ్వడమన్న సంకల్పంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని తీసుకున్నారు. నిజానికి ప్రజల భాగస్వామ్యం లేకుండా చేసే ఏ కార్యక్రమం కూడా విజయం సాధించదు. ఇది గమనించి వారిని భాగస్వాములను చేసే సంకల్పంతో దీనిని తొలిదశలో విజయవంతం చేశారు. తాజాగా ఇప్పుడు మరోమారు ఈ కార్యక్రమాన్ని కొనసగించబోతున్నారు. మనలను మనం పాలించుకుంటున్న ఈ కాలంలో ప్రజలహితం కోరి పాలకులు అడుగువేయాలి. రాజకీయమంటే అంకిత భావంతో దేశ అభివృద్ధిలో బాగస్వామ్యం కావడం. గ్రామాలను మెరుగుపరచడానికి అంకితభావం, కట్టుబాటు, చిత్తశుద్ధితో ప్రయత్నాలు జరుగుతున్న కాలమిదని గుర్తు చేయడం లక్ష్యంగా సిఎం కెసిఆర్ తీసుకున్న ఈ కార్యక్రమంతో గ్రామాల్లో గణనీయమైన మార్పులు వస్తున్నాయి. ఇటీవలి కాలంలో వివిధ సమస్యలను దృష్టిలో పెట్టుకుని చేసిన ఈ ప్రయత్నం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిమంత్రం కావాలి. ప్రజలను దేశం కోసం ప్రభావితం చేయడం కావాలి. అభివృద్ధి అన్నదే నినాదంగా రాజకీయాలు నడవాలి. అప్పుడే దేశంలో అసమానతలు తొలగిపోతాయి. మొదటి విడుతలో చేసిన పనులను పరిశీలించి, వాటిని కొనసాగింపుగా పనులను పూర్తి చేయాలని, ఇంత వరకు డంపింగ్ యార్డులు, వైకుంఠధామాల నిర్మాణం ప్రారంభించని గ్రామాల్లో వెంటనే ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవడం చేయబోతున్నారు. రెండో విడత కోసం పనులను గుర్తించి ముందుకు సాగనున్నారు. అలాగే యువతను భాగస్వామ్యం చేయడం ద్వారా అభివృద్ధికి బాటలు వేయాలి. మెచ్చుకోలు ప్రసంగాలతో కాకుండా పక్కా ప్రణాళిక, అందుకు తగ్గట్లుగా కార్యాచరణ లక్ష్యంగా పాలన సాగాలి. గ్రామస్వరాజ్యం రావాలని గాంధీజీ కలలు కన్నప్పటికి ఆయన సారథ్యం వహించిన కాంగ్రెస్ పార్టీ దేశాన్ని అర్ధ దశాబ్దం పాలించినా అది సాకారం కాలేదు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం ద్వారానే గ్రామస్వరాజ్యం సిద్దించ గలదు. గ్రామాలు బాగుపడితేనే దేశం ఆర్థికంగా పటిష్టం అవుతుంది. అందుకు పాలకులు నడుం బిగించాలి. ఆ దిశగా కార్యక్రమాలు చేయాలి. అయితే గ్రామాల్లో అలాంటి కార్యక్రమాలు జరుగుతున్న దాఖలాలు కనబడడం లేదు. ప్రజలు ఉపాధి కోసం గ్రామాలను వదిలి పట్టణాలకు వలసలు పోతున్నారు. అభివృద్ధి చెందిన భారతదేశాన్ని సాకారం చేసు కోవాలంటే కఠిన శ్రమ తప్పదు. గ్రామాలు ఆరోగ్యంగా ఉంటేనే ప్రజలు ఆరోగ్యంగా ఉంటాయి. పల్లెలు పచ్చగా ఉంటేనే రోగాలు దరిచేరవు. ఈవిషయాన్ని గమనించిన సిఎం కెసిఆర్ పల్లెలను ప్రగతి బాటన పరుగులు పెట్టించే లక్ష్యంతో గ్రామప్రణాళికకు శ్రీకారం చుట్టారు. ఆహారధాన్యాల ఉత్పత్తిలో స్వయం సమృద్ధి సాధించినా ఇప్పటికీ పౌష్టికాహారలేమి కారణంగా వ్యాధుల బారిన పడుతున్నాం. సరైన పోషక విలువలతో కూడిన ఆహారాన్ని ప్రతి ఒక్కరికీ అందేలా చేయగలగాలి. అక్షరాస్యత పెంచడానికి చాలా కృషి జరిగిందనీ, ఇప్పుడు దాని స్థాయిని మరింత పెంచి... విద్యతో పాటు విజ్ఞానం కూడా అందరికీ చేరేలా చూడాలని కెసిఆర్ తెలిపారు. పరీక్షల్లో రాయడం కాకుండా పిల్లల్లో ఆలోచనల్ని, జిజ్ఞాసను రేకెత్తించేలా పాఠశాల విద్య ఉండాలి. దాదాపు అన్ని రాష్ట్రాల్లో సదీర్ఘ కాలం కాంగ్రెస్ అధికారంలో ఉంది. అయినా వ్యవసాయంతో సహా గ్రామాల వికాసానికి ఎలాంటి మార్పులు తీసుకోలేదు. ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్నచందంగా నేటికీ గ్రామాల్లో దుర్భర పరిస్థితులు ఉన్నాయి. జన సంక్షేమమే అంతిమ ఎజెండాగా పనిచేసే వారే నిజమైన పాలకులు అని మహాత్మాగాంధీ అన్నారు. ప్రజల ఆకాంక్షలకు అద్దంపట్టేలా ప్రభుత్వం నిరంతరం శ్రమిస్తేనే పథకాలు సాకారం అవుతాయి. గ్రామాలను పరిపుష్టం చేసే దిశగా అనేక కార్యక్రమాలు సాగుతున్న తీరు ఇరత రాష్ట్రాలకు ఆదర్శం కావాలి. తెలంగాణలో కులవృత్తును బలోపేతం చేయడం అన్నది గ్రామీణ అర్థిక వ్యవస్తను బలోపేతం చేసేదిగా గమనించాలి. పరిశ్రమల పేరుతో పర్యావరణాన్ని నాశనం చేసుకునే కన్నా మన వ్యవసాయ పరిశ్రమను బాగు చేసుకోవడం మంచిది. తెలంగాణలో నీటి లభ్యత తక్కువ. తాగడానికే నీళ్లు లేవు. ఇక సాగునీరు సంగతి సరేసరి. ఈ రెండు లక్ష్యాల కోసం తెలంగాణలో మిషన్ కాకతీయ,మిషన్ భగీరత కార్యక్రమాలు చేపట్టారు. వీటి ఫలాలను ప్రజలు త్వరలోనే అందుకోబోతున్నారు. నిరంతర విద్యుత్ రావడంతో గ్రామాల్లో పరిస్థితి మారింది. వ్యవసాయానికి పెద్ద ఎత్తున కృషి జరుగుతోంది. అందుకే కంది,మిర్చి, పసుపు పంటల దిగుబడి పెరిగింది. వరి ధాన్యం దిగుబడులు పెరుగుతున్నాయి. బీళ్లు బారిన తెలంగాణ భూములను సస్యశ్యామలం చేయాలన్న సంకల్పంతో, గొంతెండుతున్న జనం కష్టాలను తీర్చాలన్న సంకల్పంతో ప్రారంభించిన పథకాలు. మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ. రాష్ట్రంలో ఇప్పటికీఅధిక శాతం గ్రామీణ ప్రాంతాలకు స్వచ్ఛమైన నీరు అందుబాటులో లేదు. ప్రత్యేకించి గిరిజన ప్రాంతాల్లో ఈ సమస్య తీవ్రంగా ఉంది. ఇలా గ్రామాలను ఆధారం చేసుకుని కార్యక్రమాలు చేస్తేనే అభివృద్ధి సాధ్యం. అదే దేశానికి శ్రీరామరక్ష. అందుకు తెలుగు రాష్ట్రాలు ఆదర్శంగా మారితే అంతకు మించిన భాగ్యం మరోటి లేదు. సుదీర్ఘకాలం తరవాత గ్రామీణాభివృద్ధి దిశగా కీలక చర్యలు చేపడుతున్నారు. పల్లె ప్రజలను పట్టిపీడిస్తున్న దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం కోసం పలు కార్యక్రమాలను ముందుకు తీసుకువస్తున్నాయి.

## ముగ్గురు పిల్లలతో తల్లి ఆత్మహత్యాయత్నం

ఖమ్మం,జనవరి2(ఆర్ఎన్ఎ): తన ముగ్గ్గరు పిల్లలతో సహా ఓ తల్లి ఆత్మహత్యాయత్నం చేసింది. ఈ సంఘటన ఖమ్మం జిల్లాలోని సత్తుపల్లి మండలం సిద్దారంలో చోటుచేసుకుంది. కొడుకు, ఇద్దరు కుమార్తెలతో సహా మహిళ గుళికలమందు తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. నలుగురిని సత్తుపల్లిలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. కుటుంబ కలహాలే ఆత్మహత్యాయత్నానికి కారణంగా సమాచారం. ఇదిలావుంటే వరంగల్ రూరల్ జిల్లాలోని రేగొండ మండలం వెంకటేశ్వరపల్లిలో దారుణ సంఘటన చోటుచేసుకుంది. భార్య కట్టుకున్న భర్త గొడ్డలితో నరికి చంపాడు. కుటుంబ కలహాలే ఇందుకు కారణంగా స్థానికులు పేర్కొన్నారు. మృతిచెందిన భార్య సుమలత, భర్త సంపతి వరకాల మండలం లక్ష్మీపురానికి చెందిన దంపతులుగా సమాచారం.

## ఉమ్మడి జిల్లా ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టి

### క్షేత్రస్థాయి పరిశీలనతో అధికారుల్లో చురుకు

నిర్మల్,జనవరి2(ఆర్ఎన్ఎ): నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాల్లో రైతాంగానికి సాగునీరు అందించేందుకు నిర్మిస్తున్న ప్రాజెక్టులను సత్వరం పూర్తి చేయాలనే లక్ష్యంతో సర్కారు ముందుకు వెళ్తున్నది. ఇప్పటికే ప్రాజెక్టుల పూర్తిపై రాష్ట్ర మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి దృష్టి పెట్టారు. పలుమార్లు క్షేత్రస్థాయిలో పర్యటించి పనులను పరిశీలించారు. సాగునీటి పారుదలశాఖ అధికారులతో సమీక్షలు నిర్వహించారు. భూములు కోల్పోయిన నిర్వాసితులు, నిర్మాణ పనులు చేపడుతున్న ఏజెన్సీల సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టారు. వచ్చే ఏడాది జూన్ నాటికి పనులు పూర్తి చేసి.. రైతాంగానికి సాగునీరు ఇవ్వాలనే లక్ష్యంతో ముందుకెళ్తున్నారు. ఇటీవల సిఎంవో కార్యదర్శి స్మితా సబర్వాల్ పర్యటనలోనూ ఈ విషయం స్పష్టం అయ్యింది. నిర్మల్ జిల్లాలో గోదావరి ఆధారితంగా సదర్‌మాట్ బ్యారేజ్, కాళేశ్వరం ప్యాకేజీ 27, 28 పనులు ఆదిలాబాద్ జిల్లాలో పెనుగంగపై చనాక –కొరట బ్యారేజీ నిర్మిస్తున్నారు. ఇప్పటికే ఈ పనులు శరవేగంగా సాగుతున్నా యి. కాళేశ్వరం 27, 28 ప్యాకేజీ పనులతో నిర్మల్, ముథోల్ నియోజకవర్గాల్లో లక్ష ఎకరాలకు సాగునీరు అందించేందుకు పనులు ప్రస్తుతం చేపడుతున్నారు. ప్యాకేజీ–27 ద్వారా నిర్మల్ నియోజకవర్గం లో 99 గ్రామాల్లో 50వేల ఎకరాలు, 28వ ప్యాకేజీ ద్వారా ముథోల్ నియోజకవర్గంలో 54 గ్రామాల్లో 50వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందనుంది. రూ.714కోట్లతో చేపట్టిన ప్యాకేజీ –27కు రూ.448 కోట్లు ఖర్చు చేసి 66శాతం పనులు, రూ.486.67కోట్లతో చేపట్టిన ప్యాకేజీ–28కు రూ.235.35కోట్లు వెచ్చించి 50శాతం పను

లు పూర్తి చేశారు. మామడ మండలం పొన్కల్ వద్ద రూ.412కోట్లతో సదర్‌మాట్ బ్యారేజీ నిర్మాణం చేపట్టగా.. ఇది పూర్తయితే 18వేల ఆయకట్టుకు సాగునీరు అందనుంది. ఆదిలాబాద్ జిల్లాలో పెనుగంగపై చనాక కోరట బ్యారేజీని రూ.324కోట్లతో నిర్మిస్తున్నారు. ఇప్పటికే బ్యారేజీ నిర్మాణం, పంపుహౌస్ పనులు పూర్తవుతుండగా.. 24 గేట్లకు గాను 18గేట్లను అమర్చారు. ఈ బ్యారేజీ నుంచి 52వేల ఎకరాలకు సాగునీరు అందనుంది. రెండు జిల్లాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి.. సదర్‌మాట్, చనాక– కోరట బ్యారేజీ పనులను స్వయంగా పరిశీలిస్తారు. ప్రాజెక్టుల పనుల తీరును పరిశీలించడంతో పాటు ప్రగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. క్షేత్రస్థాయి పరిశీలనతో పాటు అధికారుల సమీక్ష తర్వాత సమగ్ర నివేదికను సీఎం కేసీఆర్‌కు అందించారు.

# పల్లె ప్రగతితో గ్రామాలకు మహర్దశ

### స్వచ్ఛగ్రామాలకు సహకరించాలి
### పథకాలను వినియోగించుకుని సాగాలి: ఎమ్మెల్యే

ఖమ్మం,జనవరి2(ఆర్ఎన్ఎ): పంచాయితీ లను పరిశుభ్రంగా ఉంచడంలో సర్పంచ్‌లు పోటీ పడాలని, ప్రజలను కార్యోన్ముఖులను చేయాలని పాలేరు ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి అన్నారు. రెండోవిడత పల్లె ప్రగతిని పురస్కరించుకుని పలువురు సర్పంచ్‌లతో ఆయన మాటాడారు. రెండో విడత పల్లెప్రగతిలో భాగంగా మొదటి రోజున గ్రామ సభ నిర్వహించడం, రెండో రోజున పాదయాత్ర చేపట్టి పనులను గుర్తించడం, చేపట్టబోయే పనులపై మండల ప్రత్యేక అధికారులు మండల స్థాయిలో సర్పంచ్‌లు, పంచాయతీ సెక్రటరీలతో ముదస్తుగానే సమావేశం ఏర్పాటు చేయాలని తెలిపారు. సర్పంచులు, వార్డుమెంబర్లు, పంచాయతీ కార్యదర్శులు దీనిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. వైకుంఠధామాలకు సంబంధించి పంచాయతీరాజ్ శాఖకు కేటాయించిన పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. నాటిన మొక్కలకు నీటి వసతి, రక్షణ వలయాలు, నర్సరీలను తెలిపే బోర్డులు, నర్సరీల నిర్వాహణ రిజిస్టర్లు సక్రమంగా ఉండాలని నర్సరీల పనుల్లో జాప్యం చేసిన వారిపై తగు చర్యలు ఉంటాయని తెలిపారు. ఫారెస్ట్ అధికారు సందర్శించి నిర్వాహణ సంరక్షణపై సలహాలు, సూచనలు అందించాలన్నారు. ఇప్పటికే నాటిన మొక్కలలో చనిపోయిన మొక్కల స్థానంలో మరలా మొక్కలను నాటాలని, అదేవిధంగా ప్రతి ఇంట్లో ఇంకుడు గుంత ఉండేలా వందశాతం పనులను చేపట్టాలన్నారు. ఇకపోతే ప్రతి ఇంటికి తాగునీటిని అందించే లక్ష్యంతో చేపట్టిన మిషన్ భగీరథ కార్యక్రమం సీఎం కేసీఆర్ మానస పుత్రిక అని పాలేరు ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి అన్నారు. కొద్ది రోజుల్లోనే ఇంటింటికి తాగునీటిని అందించే కార్యక్రమం పూర్తవుతుందన్నారు. ఈ పథకం మంచిగా అమలు చేసేందుకు గ్రామాల్లో సర్పంచ్‌ల సహకారం ఎంతో అవసరమన్నారు. ప్రజలు ఇబ్బంది పడకుండ సర్పంచ్‌లు వెంటనే స్పందిం చాలన్నారు. మిషన్ భగీరథ కోసం సిమెంటు రోడ్లను తవ్వుతున్నారని వాటిని కాంట్రాక్టర్లకు చెప్పి వెంటనే బాగు చేయించాలన్నారు. గ్రామాలకు మిషన్ భగీరథ ద్వారా తాగునీటిని అందించే కార్యక్రమం నడుస్తుందన్నారు. జిల్లాలో పాలేరు నియోజకవర్గంతో పాటు ముదిగొండ, చింతకాని, రఘునాధపాలెం మండలాలకు పథకం ద్వారా నీటిని అందిస్తున్నామన్నారు.

# ఆత్మహత్యాయత్నం చేసిన మహిళ మృతి

### మృతి చెందిన లోకేశ్వరిది చెన్నైగా గుర్తింపు
### భర్తతో విభేదాల కారణంగానే ఆత్మహత్య

హైదరాబాద్,జనవరి2(ఆర్ఎన్ఎ): పంజాగుట్ట పీఎస్ ఆవరణలో మంగళవారం సాయంత్రం ఆత్మహత్యా యత్నం చేసిన లోకేశ్వరి అనే మహిళ మృతి చెందింది. ఆమె ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించు కుంది. వెంటనే అప్రమత్తమైన పోలీసులు ఆసుపత్రికి తరలించారు. ఉస్మానియా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ లోకేశ్వరి మృతి చెందింది

. కొంతకాలంగా లోకేశ్వరి, తన భర్త మధ్య వివాదం నడుస్తున్నట్లు సమాచారం. పంజాగుట్ట పీఎస్ ఆవరణలో చెన్నైకి చెందిన లోకేశ్వరి పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్న విషయం తెలిసిందే. మంటలు ఆర్పివేసి నిమ్స్ ఆస్పత్రికి తరలించారు. మోడల్ పీఎస్‌లోనే ఘటన జరగడంతో ఉన్నతాధికారులు ఉలిక్కిపడ్డారు.

మంగళవారం భర్తతో కలిసి లోకేశ్వరి పోలీస్‌స్టేషన్‌కు వచ్చింది. స్టేషన్‌లో అడుగుపెట్టిన కాసేపటికే పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నం చేసుకుంది. భర్తను అదుపులోకి తీసుకుని పోలీసులు ప్రశ్నించారు. హైదరాబాద్ వారాసిగూడకు చెందిన ప్రవీణ్‌కుమార్ పంజాగుట్టలో బంగారు నగల దుకాణం నిర్వహిస్తున్నాడు. ఆ దుకాణంలో లోకేశ్వరి పనికి చేరింది. ఆమె ఎంఎస్ మక్తాలో నివాసం ఉండేది. ఈ క్రమంలో వారి మధ్య పరిచయం సహజీవనం వరకు వెళ్లింది. కొంతకాలం తరువాత వారి మధ్య మనస్పర్థలు వచ్చాయి. ఇద్దరూ వేరుగా ఉన్నారు. కలిసి ఉన్నప్పుడు ఆమె అతనికి సుమారు రూ. 7.5 లక్షలు ఇచ్చినట్లు సమాచారం. ఆమెను అతను అన్ని విధాలుగా వాడుకుని మోసం చేశాడని తెలిసింది. కొద్ది రోజుల క్రితం ఆమె చెన్నైకి వెళ్లిపోయింది. ఆమెకు కూతురు ఉంది. ఆమె లోకేశ్వరి తల్లి వద్ద ఉంటుంది. ఈఘటనపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# ఆదిలాబాద్ పీఠంకోసం టీఆర్ఎస్ కసరత్తు

### గెలుపు లక్ష్యంగా నేతల ఉమ్మడి కార్యాచరణ
### సమిష్టిగా ప్రచారంతో ప్రజల ముందుకు

ఆదిలాబాద్,జనవరి2(ఆర్ఎన్ఎ): ఆదిలాబాద్ మున్సిపాలిటీలో గులాబీ జెండా ఎగురవేసేందుకు టీఆర్ఎస్ నాయకులు పక్కా ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఆదిలాబాద్ మున్సిపాలిటీ పరిధిలో 49 వార్డులు ఉండగా జనవరి 22న మున్సిపల్ ఎన్నికలు జరునున్నాయి. జనవరి 8 నుంచి నామినేషన్ల పక్రియ ప్రారంభంకానుండగా ఈలోగా అభ్యర్థుల ఎంపికను పూర్తి చేయడంతో పాటు మెజార్టీ వార్డుల్లో గులాబీ పార్టీ అభ్యర్థులు విజయం సాధించడంతో పాటు మున్సిపల్ చైర్మన్ పదవిని కైవసం చేసుకునేలా నాయకులు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఎమ్మెల్యేలు జోగు రామన్న, రాథోడ్ బాపురావు,జిల్లా పరిషత్ చైర్మన్ జనార్దన్ రాథోడ్, మున్సిపల్ ఎన్నికల ఇన్‌చార్జి, డీడీసీ చైర్మన్ లోక భూమారెడ్డితో పాటు ఆదిలాబాద్, బోథ్ , జిల్లాలోని పార్టీకి చెందిన జడ్పీటీసీలు, ఎంపీపీలు, ఇతర నాయకులు ఎవరికివారు పక్కా ప్రణాళికతో ప్రచారంలో దూసుకుని పోతున్నారు. మున్సిపాలిటీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల విజయంపై ఎలాంటి విధానాలు అవలంబించాలనే అంశాలను చర్చించడంతో పాటు చేస్తున్న అభివృద్ధిని ప్రజలకు వివరిస్తున్నారు. కెసిఆర్ నాయకత్వంలోని ప్రభుత్వం ఆరేండ్లుగా అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలు జిల్లా ప్రజలకు ఎంతో ప్రయోజనకరంగా మారాయి. సర్కారు పథకాలతో పట్టణ ప్రాంతాల ప్రజల ఉపాధి ఎంతో మెరుగుపడింది. ఆసరా పింఛన్లు, కల్యాణలక్ష్మి, షాదీముబారక్, రూ.1 కిలో బియ్యం, వ్యక్తిగత రుణాలు, పేద విద్యార్థులకు రెసిడెన్షియల్ పాఠశాలలు, అమ్మఒడి, కేసీఆర్ కిట్, విద్యార్థులకు సన్నబియ్యంతో కూడిన మధ్యాహ్న భోజనం పథకాలు ప్రజలకు ఎంతో మేలు చేస్తున్నాయని వివరిస్తున్నారు. జిల్లాలో ఏ ఎన్నికలు జరిగినా ప్రజలు గులాబీ పార్టీని ఆదరిస్తున్నారు. ఆదిలాబాద్ మున్సిపాలిటీకి త్వరలో ఎన్నికలు జరుగనుండగా ఈ ఎన్నికల్లో టీఆర్ఎస్ అభ్యర్థుల విజయం కోసం పార్టీ నాయకులు పటిష్టమైన ప్రణాళికలతో ముందుకు సాగుతున్నారు. ప్రస్తుతం మున్సిపల్ పరిధిలో 49 వార్డులు ఉండగా మెజార్టీ స్థానాల్లో గులాబీపార్టీ విజయం సాధించేలా చర్యలు చేపట్టారు సన్నాహక సమావేశాలను నిర్వహిస్తున్నారు. ప్రతి వార్డుకు ముగ్గురు నాయకులతో కూడిన కమిటీని ఏర్పాటు చేశారు. ఒక్కో కమిటీకి 3 నుంచి 5 వార్డులు కేటాయించారు. వీరు రెండ్రోజులుగా అన్ని వార్డుల్లో సమావేశాలు ఏర్పాటు చేశారు. ప్రతి వార్డులో టీఆర్ఎస్ నుంచి పోటీ చేసేందుకు పలువురు ఆసక్తి చూపుతున్నారు. ఈ సమావేశాల్లో పార్టీ అభ్యర్థులు విజయం సాధించేలా అందరూ కృషి చేయాలని సూచించారు. మున్సిపాలిటీపై గులాబీ జెండా ఎగురవేసేందుకు పార్టీ నాయకులు పక్కా ప్రణాళికతో ముందుకు సాగుతున్నారు. రాష్ట్ర ఎన్నికల సంఘం మున్సిపల్ ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన నేపథ్యంలో టీఆర్ఎస్ నాయకులు ఆదిలాబాద్ మున్సిపాలిటీపై గులాబీ జెండా ఎగురవేసేందుకు పక్కా ప్రణాళికలతో ముందుకు సాగుతున్నారు. ప్రతి వార్డులో టీఆర్ఎస్‌కు చెందిన ఎనిమిది కమిటీలు ఉండగా మగ్గురు నాయకులతో ఏర్పాటు చేసిన కమిటీ సభ్యులు మున్సిపల్ పరిధిలో మూడు నుంచి ఐదు వార్డులకు ఇన్‌చార్జులుగా వ్యవహరిస్తున్నారు. వీరు రెండ్రోజులుగా వార్డు కమిటీ సభ్యులు సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఇటీవల జరిగిన వార్డుల పునర్విభజనలో భాగంగా చాలా ప్రాంతాల్లో పాత వార్డులు మారాయి. ఈ సమావేశాల్లో మారిన వార్డు సభ్యులను గుర్తించడంతో పాటు, ఆయా వార్డుల్లో ఓట్లు ఎన్ని ఉన్నాయి, ప్రభుత్వ పథకాలతో ఆయా ప్రాంతాల్లో చేపట్టిన కార్యక్రమాలు, ఇతర అంశాలను చర్చించడంతో పాటు వార్డుల కమిటీ సభ్యులు సన్నాహక సమావేశానికి హాజరయ్యేలా చర్యలు తీసుకుంటున్నారు. ఎన్నికల సమయంలో మెదలాల్సిన తీరుపై పార్టీ నేతలకు దిశానిర్దేశం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని సూచించారు.

# ఈ ఏడాదే ఫార్మాసిటీని ప్రారంభిస్తాం

### 3న ముంబయిలో ఫార్మా సదస్సుకు హాజరవుతా
### ప్రగతిశీల రాష్ట్రాలను ప్రోత్సహించాలి: కెటిఆర్

హైదరాబాద్,జనవరి2(ఆర్ఎన్ఎ): ఈ ఏడాది ఫార్మా సిటీని ప్రారంభించనున్నట్లు రాష్ట్ర మున్సిపల్, ఐటీశాఖ మంత్రి కేటీఆర్ తెలిపారు. తెలంగాణ భవన్‌లో మీడియాతో మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ ఈ సందర్భంగా పార్టీ వ్యవహారాలు, అభివృద్ధి, రాజకీయాలు వంటి పలు అంశాలపై మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇచ్చారు. ప్రగతిశీల రాష్ట్రాలను కేంద్రం పరిగణలోకి తీసుకుంటే దేశానికే మంచిదని కేటీఆర్ అన్నారు. అందులోనూ రాజకీయాలు ఆలోచిస్తే దేశానికి మంచిది కాదన్నారు. ఐదు ట్రిలియన్ డాలర్ల కల సాకారం కావాలంటే రాష్ట్రాలను ప్రోత్సహించాలని పేర్కొన్నారు. కేంద్రం సాయం చేయకపోయినా ఐటీలో హైదరాబాద్ అగ్రస్థానంలోనే కొనసాగు తుందన్నారు. ఎన్‌పీఆర్, ఎన్ఆర్‌సీపై నిర్ణయం ప్రభుత్వమే తీసుకుంటుందన్నారు. ఈ నెల 3న ముంబయిలో జరిగే ఫార్మా సదస్సుకు హాజరుకానున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో ఈ ఏడాది ఫార్మా సిటీని ప్రారంభించనున్నట్లు చెప్పారు. ఏపీ సహా పొరుగు రాష్ట్రాల ప్రభుత్వాలతో సత్సంబంధాలు కొనసాగిసామన్నారు. ఫార్మారంగంలో తెలంగాణ భారీగా అభివృద్ధిసాధిస్తోందని, నగరంలో ఏర్పాటు చేయబోయే ఫార్మాసిటీని ఈ సంవత్సరంలోనే ప్రారంభిస్తామని వెల్లడించారు. ఆయా రాష్ట్రాలను ప్రోత్సహించాల్సిన బాధ్యత కూడా కేంద్రం పై ఉందన్నారు.

# ఉమ్మడి జిల్లాలో మున్సిపల్ వేడి

### పట్టణాల్లో ప్రచార హోరు
### గెలుపు లక్ష్యంగా అధికార పార్టీ నేతల ప్రచారం

ఖమ్మం,జనవరి2(ఆర్ఎన్ఎ): ఉమ్మడి ఖమ్మం జిల్లాలో వివిధ మున్సిపాలిటీల్లో అధికార టిఆర్ఎస్ ప్రచార వేగాన్ని పెంచింది. ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు ప్రచారంలో ప్రభుత్వ పథకాలను ప్రస్తావిస్తున్నారు.

పట్టణాల అభివృద్దిని టిఆర్ఎస్ మాత్రమే చేయగలదని చెబుతున్నారు. ఇల్లెందు అభివృద్ధికి అందరం చేయిచేయి కలుపుదామని ఎమ్మెల్యే బానోత్ హరిప్రియానాయక్ పిలుపునిచ్చారు. మున్సిపల్ ఎన్నికల్లో సిఎం కేసీఆర్‌ను ఆశీర్వదించాలని, కారు గుర్తుకు ఓటేసి ఇల్లందులో 24 వార్డులు గెలుచుకునే విధంగా తీర్పు ఇవ్వాలని ఎమ్మెల్యే అన్నారు. టీఆర్ఎస్ పార్టీకి సంపూర్ణ మద్దతు ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు. పట్టణాన్ని సుందరీకరించడమే కర్తవ్యమన్నారు. అభివృద్ధి వైపు అడుగులు వేస్తోందని, మినీ స్టేడియం, మినీ ట్యాంక్‌బండ్, మోడల్ కూరగాయల మార్కెట్ రూపుదిద్దుకుంటున్నాయని అన్నారు. పట్టణ ప్రజల ఆశీర్వాదంతో మరింత అభివృద్ధి చేయాలన్న ఆకాంక్ష ఉందన్నారు. సింగరేణి కార్మిక ప్రాంతాల్లో పట్టణాలు అభివృద్ధి పథంలో సాగుతున్నాయని, వాటికి దీటుగా మోడల్‌గా తీర్చిదిద్దాలన్నారు. సింగరేణి నిధుల ద్వారానే అభివృద్ధి చేయాలని నిర్ణయించుకున్నామన్నారు. సంస్థతో చర్చించగా, సానుకూలంగా స్పందించిందన్నారు. రానున్న రోజుల్లో ప్రభుత్వంతో పాటు సింగరేణి సంస్థతో చర్చించి పట్టణానికి పెద్ద ఎత్తున నిధులు తీసుకొచ్చేందుకు కృషి చేస్తానన్నారు. టీఆర్ఎస్‌కు మున్సిపల్ ఎన్నికల్లో సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు కార్మికులంతా ముందుకు రావడం చాలా సంతోషంగా ఉందన్నారు. సీఎం కేసీఆర్ తెలంగాణాభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్నారని, ఎన్నో సంక్షేమ పథకాలు ప్రజల ముందుకు తీసుకొచ్చారన్నారు. సత్తుపల్లి మునిసిపాలిటీ ఎన్నికల్లో నాయకులు మెచ్చిన వారిని కాకుండా ప్రజలు మెచ్చిన వారినే అభ్యర్థులుగా బరిలో నిలుపుతామని ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య అన్నారు. ప్రజాహితం కోరే వారే రాజకీయాల్లో రాణిస్తారని, ప్రతి వార్డులో ప్రజల మనస్సును గెలిచిన వారినే బరిలోకి దింపుతామన్నారు. 23 వార్డుల్లో ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేసి మునిసిపాలిటీపై టీఆర్ఎస్ జెండా ఎగరవేయాలన్నారు. పట్టణంలో రూ.50కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, తెలుగు రాష్ట్రాల్లో ఇసుక కొరత వల్ల పనుల్లో కొంత జాప్యం జరిగిందని, జనవరి నెలాఖరు కల్లా వాటిని పూర్తిచేసి పట్టణంలో మట్టిరోడ్లు లేకుండా చేస్తామన్నారు. ఇప్పటికే తామరచెరువు, వేశ్యకాంతల చెరువును ఆధునీకరించి ట్యాంక్ బండ్‌గా రూపొందించే పనులతో పాటు 350 ఎకరాల్లో అటవీపార్కు, జేవీఆర్ పార్కును అత్యాధునికంగా అభివృద్ధి చేయడం వంటి కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. పట్టణాభివృద్ధిలో ఏ మాత్రం వెనుకాడకుండా ముందుకు సాగుతున్నామని, సంక్షేమ పథకాల అమలులో రాష్ట్రం ముందంజలో ఉందన్నారు. పట్టణ ప్రజలు ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల ప్రకారం ఆలోచించి టీఆర్ఎస్ పార్టీకి పట్టం కట్టాలన్నారు. వార్డుల రిజర్వేషన్ పూర్తయిన తర్వాత అభ్యర్థులను బరిలో నింపే సమయానికి పట్టణంలోని ప్రతి వార్డును కలియతిరుగుతామన్నారు.

# నీతి ఆయోగ్ లక్ష్యాలను విస్మరించిన కేంద్రం

### నిధుల విడుదలలో పక్షపాత ధోరణులు: చారి

హైదరాబాద్,జనవరి2(ఆర్ఎన్ఎ): నీతి ఆయోగ్ ఏర్పడ్డ తొలినాళ్లలో ప్రధాని మోడీ ఇచ్చిన హామీలు అమలుకావడం లేదని ఢిల్లీలో తెలంగాణ ప్రభుత్వ ప్రతినిధి డాక్టర్ సముద్రాల వేణుగోపాలాచారి అన్నారు. రాష్ట్రాలకునిధుల విడుదలలోనూ, సమిష్టి నిర్ణయాల్లో భాగస్వాములను చేయడంలోనూ కేంద్రం విఫలమయ్యిందన్నారు. నీతి ఆయోగ్ ఏర్పాటుచేసిన సందర్భంలో చెప్పిన మాటలు విస్మరించి మాట్లాడడం సరికాదన్నారు. బిజెపి పాలకులు కొత్త ఒరవడిని సృష్టిస్తారని అనుకుంటే కాంగ్రెస్ మూసలోనే నడుస్తున్నారని అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సంబంధాలపై గొప్పలు చెప్పిన ప్రధాని ఇప్పుడు అందుకు బిన్నంగా ఉన్నారని అన్నారు. కేంద్రం నిధులు విడిల్చడమనేది ఫెడరల్ విధానంలో భాగమని అన్నారు. కేసీఆర్ నేతృత్వంలో రాష్ట్రం బంగారు తెలంగాణగా మారుతుందన్నారు. ప్రాజెక్టులను అడ్డుకుంటే చరిత్రహీనులు కాక తప్పదని కాంగ్రెస్, టిడిపిలను ఆయన హెచ్చరించారు. ప్రభుత్వం కోటి ఎకరాలకు సాగు నీరు లక్ష్యంగా ప్రాజెక్టుల రీడిజన్ చేసి నిర్మిస్తుంటే బీజేపీ, కాంగ్రెస్, టీడీపీలు జల రాజకీయం చేస్తున్నాయని ఆక్షేపించారు. ఇకపోతే కాళేశ్వరానికి జాతీయ హోదా ఇచ్చివుంటే బిజెపి పరపతి పెరిగేదన్నారు. కానీ ఇవ్వకుండా విమర్శలుచేయడం ఎంతవరకు సబబని అన్నారు. ఎన్ని అడ్డంకులు ఎదురైనా రాష్ట్రటంలో చేపట్టిన అన్ని ప్రాజెక్టునలు మరో మూడేళ్లలో పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. ప్రభుత్వం వ్యవసాయ రంగానికి పెద్దపీట వేస్తుందన్నారు. కోటి ఎకరాలకు సాగునీ రే లక్ష్యంగా ప్రాజెక్టులు కడుతున్నట్లు చెప్పారు. దీన్ని ప్రతిపక్షాలు జీర్ణించుకోలేక పోతున్నాయన్నారు. మరో 20 ఏళ్ల పాటు టీఆర్ఎస్ పార్టీ గెలిచి అధికారంలో ఉండి రాష్ట్రం సంపూర్ణ అభివృద్ధి సాధిస్తుందని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి చెందాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి అనేక సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టారని కొనియాడారు. ఇకపోతే ప్రాజెక్టుల విషయంలో కాంగ్రెస్ నేతలు జలరాజకీయాలు మానుకోవాలని అన్నారు. ప్రతి ఎకరాకు సాగునీటిని అందించి రైతుల కళ్లల్లో ఆనందం చూడడమే ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. కల్వకుర్తి ఎత్తిపోతల పథకం నీటితో చెరువులు, కుంటలను నింపి ప్రతి ఎకరాకు సాగునీరందించడమే ప్రభుత్వ ధ్యేయమని అన్నారు. పల్లె ప్రగతి ప్రణాళికతో గ్రామాల రూపురేఖలు మారనున్నాయని అన్నారు. దీనికి ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలన్నారు. మన గ్రామాలను మనమే బాగుచేసుకోవడం గాంధీ లక్ష్యమన్నారు.

# పల్లె ప్రగతితో గ్రామాల రూపు రేఖలు మారాలి

### సర్పంచ్‌లు బాధ్యతతో ముందుకు సాగాలి
### గ్రామాల్లో నీటి పొదుపు పాటించాల్సిందే
### నీటి సంరక్షణకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలి: జడ్పీ ఛైర్మన్

జనగామ,జనవరి2(ఆర్ఎన్ఎ): పల్లె ప్రగతి కోసం చేపట్టిన ప్రగతి కార్యక్రమంలో ప్రతి ఒక్కరు భాగస్వామ్యంకావాలని జెడ్పీచైర్మన్ పాగాల సంపత్‌రెడ్డి పిలుపునిచ్చారు. గ్రామాలు బాగు పడాలంటే ప్రణాళిక మేరకు ముందుకు సాగాల్సి ఉందన్నారు. రెండోవిడత ప్రణాళికలో ముందుండి జనగామ జిల్లా పేరును నిలబెట్టే ప్రయత్నం చేయాలన్నారు. అధికారులు సర్పంచులను సమన్వయం చేసుకుని పారిశధ్యం, వైకుంఠధామాల నిర్మాణం తదితర కార్యక్రమాలు సాగుతాయని అన్నారు.

చెట్లను పెంచినట్లయితే సకాలంలో వర్షాలు కురుస్తాయని, రైతుల భూముల్లో ఫాంపాండ్‌లు, ఇంకుడుగుంతలు తప్పని సరిగా నిర్మించుకోవాలని సూచించారు. ప్రభుత్వం అమలు చేసిన 30రోజుల కార్యక్రమంలో గ్రామంలోని పారుశుద్యం, నీటి సంరక్షణ చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. కరువు జిల్లా పేరును తీసేయాలని అందుకు తక్కువ నీటితో ఎక్కువ పంటలు పండించాలని రైతులను కోరారు. జనగామ జిల్లాలో ప్రతీ వర్షపు నీటి బొట్టు వృధాగా పోకుండా భూగర్భంలో ఇంకేలా ఒడిసిపట్టే బృహత్తర కార్యక్రమాన్ని ప్రజల భాగస్వామ్యం తో ఉద్యమంలో చేపట్టాలని జెడ్పీచైర్మన్ పాగాలపిలుపునిచ్చారు. తీవ్ర నీటి ఎద్దడితో అల్లాడే ఎగువ ప్రాంతాన్ని కేంద్రం జలశక్తి అభియాన్ కింద ఎంపిక చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. ఇక్కడి కరువు, దుర్భిక్ష పరిస్థితులు దేశం గుర్తించిందని, అయితే అధికారులు, ప్రజల నీటి సంరక్షణ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని అన్నారు. ఇప్పటికే నీటి సంరక్షణ కోసం జిల్లాలో రూ. 2కోట్లు చేశామని అన్నారు.

భూగర్భంలో జలసంపద అడుగంటి పోవడానికి ప్రధాన కారణం అడవుల శాతం తగ్గిపోయి వర్షాలు సమృద్ధిగా కురియక పోవడం అన్నారు. లభ్యమవుతున్న నీటిని పొదుపుగా వాడుకుంటూ వర్షం కురిసిన సమయంలో ప్రతీ చుక్కను కాపాడుకుంటే తప్ప భవిష్యత్ ఉండదన్నారు. నీటి సంరక్షణ పనులు చేపట్టాలంటే ఎంతో ఖర్చుతో కూడుకున్నదని అందుకే వరుణుడు కరుణించినప్పుడే ఒడిసిపట్టుకునే చర్యలను ప్రారంభించాలన్నారు.

ఒకపక్క ఉన్న నీటిని కాపాడుకుంటూ మరోపక్క వర్షపునీరు వృధాగా పోకుండా సంరక్షించుకునే దిశగా గ్రామస్థాయిలో ప్రజాప్రతినిధులు ప్రజల భాగస్వామ్యంతో ముందుకు సాగాలని కోరారు. పంటలకు కోతుల వల్ల తీవ్రనష్టం వాటిల్లుతుందన్న దృష్ట్యా కేంద్ర ప్రభుత్వం కోతుల బెడద నివారణకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాల్సిన అవసరం ఉందన్నారు. వ్యవసాయం ప్రధాన వృత్తిగా జీవించే రైతులకు మరింత అండగా నిలిచేందుకు ఉపాధిహామీ పథకాన్ని వ్యవసాయం, అనుబంధంగా మరిన్ని పనులకు అనుసంధానం చేయాలని కోరారు. నీటిని వృథా చేయకుండా వేస్టేజీ వాటర్‌ను సైతం సద్వినియోగం చేసుకునేలా అధికారుల సూచనలు పాటించి రాబోయే తరాలకు కానుక ఇవ్వాలన్నారు. కరువు జిల్లా అని ఇక్కడి వారందరికి తెలుసు కరువును పారదోలడానికి విరివిగా చెట్లను నాటి, వాననీటిని ఒడిసిపట్టాలన్నారు. అందుకు సీఎం కేసీఆర్ ప్రతిష్ఠాత్మకంగా తీసుకోని కాళేశ్వరంలో నీటిని ఒడిసిపట్టినట్లు ప్రజలు వాన నీటిని ఒడిసిపట్టి నీటి నిల్వలను పెంపొందించు కోవాలన్నారు. ప్రతీ ఇంటికి ఇంకుడు గుంతలు నిర్మించుకుని ప్రతీ నీటి బొట్టు బయటకు పోకుండా భూమిలోపలికి పోయేటట్లు చేసుకోవాలని తెలిపారు. గ్రామాలు పరిశుభ్రంగా ఉండేలా ప్రజలు సహకరించాలన్నారు.

## జనగామ పట్టణ అభివృద్ధికి కట్టుబడి ఉన్నా

### మున్సిపల్ ప్రచారంలో ఎమ్మెల్యే ముత్తిరెడ్డి

జనగామ,జనవరి2(ఆర్ఎన్ఎ): జనగామ పట్టణ అభివృద్ధి ప్రజల చేతుల్లోనే ఉందని, వచ్చే మున్సిపల్ ఎన్నికల్లో 30 వార్డుల్లో గులాబీ జెండా ఎగురవేసి టీఆర్ఎస్ అభ్యర్థులను కౌన్సిలర్లుగా గెలిపిస్తే సర్వ హంగులతో పట్టణ సుందరీకరణ బాధ్యతను తాను ముఖ్యమంత్రి కేసీఆర్ చేతిలో పెడతానని ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి హామీ ఇచ్చారు. త్వరలో జరిగే మున్సిపల్ ఎన్నికల్లోనూ కేసీఆర్‌కు మరింత బలాన్ని ఇచ్చేలా 30 వార్డు స్థానాల్లో టీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించి జనగామ మున్సిపల్‌పై గులాబీజెండా ఎగురవేయాలని ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి కోరారు. గతంలో కంటే మెరుగ్గా పట్టణ అభివృద్ధి చేశామని, ఇకపై జరిగే ప్రగతి ప్రజల చేతుల్లో పెడుతున్నాని చెప్పిన ఎమ్మెల్యే.. గత పాలనలో పరిస్థితిని గుర్తు చేసుకోవాలని, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత జరుగుతున్న పనులు చూసి నిర్ణయం తీసుకోవాలని అన్నారు. త్వరలో జరిగే ఎన్నికల్లో టీఆర్ఎస్‌ను దీవిస్తే ప్రజల్లో ఒకడిగా ఉంటూ జిల్లా కేంద్రాన్ని అభివృద్ధిలో అగ్రపథాన నిలుపుతానని ముత్తిరెడ్డి హామీ ఇచ్చారు .వార్డుల్లో పర్యటిస్తూ ఖాళీ స్థలాల్లో మురికి తుమ్ములు, చెత్తాచెదారాన్ని పోగుచేసి దగ్గరుండి కాల్చివేయించారు. చెత్తాచెదారంతో నిండిన డ్రైనేజీలను శుభ్రం చేయించారు. టీఆర్ఎస్ సర్కారు హయాంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి పట్టణంలోని అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారని చెప్పారు. టీఆర్ఎస్ ప్రభుత్వం పట్టణ సుందరీకరణ కోసం మంజూరు చేసిన రూ. 30 కోట్ల నిధుల్లోంచి ఇప్పటికే బస్టాండ్ చౌరస్తా నుంచి నెహ్రూపార్కు, చౌరస్తా నుంచి సూర్యాపేట రోడ్డు, సిద్ధిపేట రోడ్డు, హైదరాబాద్–హన్మకొండ రోడ్డు విస్తరణ, డ్రైనేజీ, సెంట్రల్ లైటింగ్ వంటి అభివృద్ధి, సీసీరోడ్ల నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయని వివరించారు. త్వరలోనే రంగప్పచెరువును సుందరీకరించుకుంటామని చెప్పారు.

## చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ నియామకం చారిత్రాత్మకం

### ప్రధాని మోడీ సాహసోపేత నిర్ణయం
### వరుస ట్వీట్లతో హోంమంత్రి అమిత్ షా వెల్లడి

న్యూఢిల్లీ,జనవరి2(ఆర్ఎన్ఎ): చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ (సీడీఎస్)ను నియమించాలన్న డిమాండ్ చాలా కాలంగా ఉందని, దీనిని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నెరవేర్చారని, ఇది అత్యంత మహత్తరమైన, చరిత్రాత్మకమైన రోజు అని కేంద్ర హోం మంత్రి అమిత్ షా అన్నారు. బుధవారం ఆయన ఇచ్చిన ట్వీట్లలో త్రివిధ దళాలు సమష్టిగా పనిచేస్తాయని, భారత దేశాన్ని దృఢంగా కాపాడతాయని విశ్వాసం వ్యక్తం చేశారు.

సీడీఎస్ నియామకం నవభారత ఆకాంక్షలను నెరవేర్చడానికి దోహదపడుతుందన్నారు.

ప్రధానినరేంద్ర మోదీమరొక దీర్ఘకాలిక డిమాండ్‌ను నెరవేర్చారు, భారత దేశానికి మొట్టమొదటి చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ వచ్చారు, ఇది భారత దేశానికి అత్యంత మహత్తరమైన, చరిత్రాత్మక రోజు. ప్రపంచంలో అత్యుత్తమ రక్షణ దళాల్లో ఒకటిగా ఉండాలన్న భారత దేశపు దృఢ నిశ్చయాన్ని ఈ నిర్ణయం మరింత బలోపేతం చేస్తుందన్న నమ్మకం నాకు ఉందని అమిత్ షా పేర్కొన్నారు. భారత దేశపు మొదటి చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్‌గా బాధ్యతలు స్వీకరించిన జనరల్ బిపిన్ రావత్‌ను అభినందిస్తున్నాను. ఆయన నాయకత్వంలో త్రివిధ దళాలు సమష్టిగా ఓ జట్టుగా పని చేస్తాయని, అన్ని వైపరీత్యాల నుంచి మన దేశాన్ని కాపాడటానికి ఏ అవకాశాన్నీ వదిలిపెట్టవని విశ్వసిస్తున్నానని మరొక ట్వీట్‌లో పేర్కొన్నారు.

## లంచం కేసులో ఇంటిలిజెన్స్ అడిషనల్ డైరెక్టర్ అరెస్ట్

న్యూఢిల్లీ,జనవరి2(ఆర్ఎన్ఎ): డైరెక్టరేట్ ఆఫ్ రెవన్యూ ఇంటెలిజెన్స్ శాఖలో అడిషనల్ డైరెక్టర్ జనరల్‌గా పనిచేస్తున్న చందర్ శేఖర్‌ను సిబిఐ పోలీసులు ఢిల్లీలో అరెస్టు చేశారు. ఏడీజీకి సంబంధం ఉన్న ఓ మధ్యవర్తి.. 25 లక్షల లంచం తీసుకుంటూ పట్టుపడ్డాడు. అయితే ఈ కేసుకు సంబంధించి ఢిల్లీ, నోయిడా, లూథియానాలో సోదాలు జరుగుతున్నాయి. లూథియానాలో చందర్ శేకర్ ఏడీజీగా పనిచేస్తున్నారు. ఆఫీసర్ తరపున మధ్యవర్తి లంచం తీసుకుంటున్న సమయంలో పోలీసులు అతన్ని అరెస్టు చేశారు. అయితే ఇద్దరి మధ్య కుదిరిన భారీ ఒప్పందం ప్రకారమే మధ్యవర్తి ఈ లంచం తీసుకున్నట్లు తెలుస్తోంది.

# అక్షర తెలంగాణే ధ్యేయం: బుక్ ఫెయిర్ సొసైటీ



హైదరాబాద్, జనవరి 2: తెలంగాణ రాష్ట్రాన్ని అక్షర తెలంగాణ వైపు నడిపించడమే హైదరాబాద్ బుక్ ఫెయిర్ సొసైటీ ధ్యేయమని నిర్వాహకులు తెలిపారు. గడిచిన డిసెంబర్ 23వ తేదీ నుంచి జనవరి 1వ తేదీ వరకు నగరంలోని తెలంగాణ కళాభారతి ప్రాంగణంలో హైదరాబాద్ బుక్ ఫెయిర్ జరిగిన విషయం తెలిసిందే. బుక్ ఫెయిర్‌పై నిర్వాహకులు మాట్లాడుతూ.. బుక్ ఫెయిర్ పుస్తకాల అమ్మకాలకే పరిమితం కాలేదన్నారు. బాల మేళాలు, పుస్తకావిష్కరణలతో సాహితీ సంగమంగా నిలిచిందన్నారు. జాతీయ పుస్తక ప్రదర్శనను 8.5 లక్షల మంది సందర్శించినట్లు తెలిపారు. గత ఐదేళ్లలో 50 లక్షల మంది బుక్ ఫెయిర్‌ను సందర్శించినట్లు చెప్పారు. రాష్ట్ర రాజధానికే పరిమితం కాకుండా గ్రామ, మండలస్థాయికి పుస్తక ప్రదర్శనల్ని తీసుకెళ్తామన్నారు. ఈ ఏడాది 33 జిల్లాల్లో పుస్తక ప్రదర్శనలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం నుంచి సంపూర్ణ సహకారం ఉందన్నారు. గ్రంథాలయ పునర్నిర్మాణానికి బుక్ ఫెయిర్ పాటుపడుతోందన్నారు. బుక్ ఫెయిర్‌ను ఆరు నెలలకోసారి ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు రచిస్తున్నట్లు పేర్కొన్నారు.

# టీఆర్ఎస్ దిగజారుడు రాజకీయాలు

## మున్సిపల్ ఎన్నికల్లో సత్తా చాటుతాం: ఉత్తమ్

సూర్యాపేట, జనవరి2(ఆర్ఎన్ఎ): టీఆర్ఎస్ కుటుంబ పాలన, దోపిడీ పాలన రాజకీయాల్ని భ్రష్టు పట్టించిందని టీపీసీసీ చీఫ్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి విమర్శించారు. దిగజారుడు రాజకీయాలు చేస్తున్నది టీఆర్ఎస్ పార్టీయేనని అన్నారు. బుధవారం ఉత్తమ్ మీడియాతో మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికల్లో తమ పార్టీ సత్తా చాటుతుందని అన్నారు. ఈ సందర్భంగా కేసీఆర్‌ను సూటిగా అడుగుతున్నా. నిరుద్యోగ భృతి ఎక్కడ? రుణమాఫీ ఎక్కడ? రైతు బంధు ఎక్కడ? మున్సిపల్ ఎన్నికల్లో ఈ అంశాల్ని ప్రజల్లోకి తీసుకెళ్లి టీఆర్ఎస్ పార్టీని ఎండగడతాం. నేను మున్సిపల్ ఎన్నికల గురించి మాట్లాడితే నాపైన టీఆర్ఎస్ నేతలు పిచ్చి పిచ్చి విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. రిజర్వేషన్లు ముగిశాక నామినేషన్‌లకు వారం రోజుల గడువు ఇవ్వాలన్నారు. కేసీఆర్,మోదీ ఇద్దరూ రాజకీయాలను భ్రష్టుపట్టిస్తున్నారు. కేంద్రంలో మోదీ మతపరైన రాజకీయాలు చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా పోలీస్ వాళ్లను ఉపయోగించి కాంగ్రెస్ కార్యకర్తలను అణిచివేస్తున్నారు. అందుకు నిరసనగా త్వరలోనే జైల్ భరో నిర్వహిస్తాం. గతంలో కాంగ్రెస్ పార్టీలో ఉండి వేరే పార్టీలోకి వెళ్లిన నేతలు మళ్లీ కాంగ్రెస్‌లోకి రావాలని ఆహ్వానిస్తున్నాను. బడుగు, బలహీన వర్గాలకు, మైనార్టీలకు ప్రాధాన్యత ఇచ్చే పార్టీ కాంగ్రెస్ పార్టీ మాత్రమేనని అన్నారు. టీఆర్ఎస్ పార్టీ కుటుంబ పార్టీ అని ఉత్తమ్ పేర్కొన్నారు.

# మున్సి'పోల్స్'షెడ్యూల్ చట్ట విరుద్ధం

## రిజర్వేషన్లు ఖరారు చేయకుండా ఎన్నికల ప్రక్రియ ప్రారంభిస్తారా..?
## హైకోర్టులో పిల్ దాఖలు చేసిన పిసిసి చీఫ్ ఉత్తమ్ కుమార్ రెడ్డి

హైదరాబాద్,డిసెంబర్ 2 (ఆర్ఎన్ఎ): మున్సిపల్ ఎన్నికల నిర్వహణలో భాగంగా రాష్ట్ర ఎన్నికల సంఘం డిసెంబరు 23న జారీ చేసిన ఎన్నికల షెడ్యూలు నోటిఫికేషన్‌ను సవాలు చేస్తూ హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. ఎస్టీ, ఎస్సీ, బీసీ, మహిళా రిజర్వేషన్లు ఖరారు చేయకుండానే జనవరి 7 నుంచి ఎన్నికల ప్రక్రియ ఆరంభమయ్యేలా షెడ్యూలు విడుదల చేయడం చట్ట, రాజ్యాంగ విరుద్ధమంటూ పీసీసీ అధ్యక్షుడు ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఈ వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. సదరు నోటిఫికేషన్‌ను చట్టవిరుద్ధమైనదిగా ప్రకటించాలని, సవరించేలా రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని ఆదేశించాలని కోరారు. విచారణ ముగిసే వరకు ఆ నోటిఫికేషన్ ఆధారంగా ఎలాంటి చర్యలు చేపట్టకుండా మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయాలని అభ్యర్థించారు.

'మున్సిపాలిటీల పాలకవర్గాల గడువు ముగిశాక మున్సిపల్ చట్ట సవరణతోపాటు వార్డుల విభజన, వర్గీకరణ నిమిత్తం గత ఏడాది జులై 7న ప్రభుత్వం(జీవో 78) తుది నోటిఫికేషన్ జారీ చేసింది. అందులో పేర్కొన్న నిబంధనలకు విరుద్ధంగా వార్డుల విభజన జరిగిందని పేర్కొంటూ హైకోర్టులో పిటిషన్‌లు దాఖలవగా..దాన్ని రద్దు చేస్తూ కోర్టు నవంబరు 29న ఉత్తర్వులు జారీ చేసింది. వారంలోగా అభ్యంతరాలు స్వీకరించి, పరిష్కరించాలని కమిషనర్లను ఆదేశించింది.

కోర్టు ఉత్తర్వుల నేపథ్యంలో డిసెంబరు 3 నుంచి 9 వరకు ప్రజల నుంచి సలహాలు, అభ్యంతరాలు స్వీకరించి, 16లోగా పరిష్కరించాలని పురపాలక శాఖ సంచాలకుడు ఆయా మున్సిపల్ కమిషనర్లకు ఆదేశాలు జారీ చేశారు. ప్రజల అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోకుండానే డిసెంబరు 17న తుది నోటిఫికేషన్లు జారీ చేశారు. అందుకు అనుగుణంగా 10 మున్సిపల్ కార్పొరేషన్‌లు, 12 మున్సిపాలిటీలలో డిసెంబరు 31 నుంచి జనవరి 4లోగా ఓటర్ల జాబితాలు ప్రచురించాలంటూ రాష్ట్ర

ఎన్నికల సంఘం డిసెంబరు 23న నోటిఫికేషన్ జారీ చేసింది. దాంతోపాటు జనవరి 7న ఎన్నికల నోటిఫికేషన్ జారీ అయ్యేలా షెడ్యూలునూ విడుదల చేసింది.

'షెడ్యూలు విడుదల నాటికి ఓటర్ల జాబితా కూడా తయారు కాలేదు. ఎస్టీ, ఎస్సీ, బీసీ, మహిళా రిజర్వేషన్ల ప్రస్తావనా లేదు. రిజర్వేషన్లు ఖరారు చేయకుండా ఎన్నికల షెడ్యూలు విడుదల చేయడం మున్సిపల్ చట్టంలోని సెక్షన్ 6,7లకు విరుద్ధం. పత్రికల సమాచారం మేరకు ఈ నెల 5, 6 తేదీల్లో ప్రభుత్వం రిజర్వేషన్లు ఖరారు చేసే అవకాశం ఉంది. 7న నోటిఫికేషన్ జారీ అయితే రిజర్వేషన్లపై అభ్యంతరాలు వ్యక్తంచేసే అవకాశం ఉండదు. అప్పటికప్పుడు కుల ధ్రువీకరణ పత్రాలు పొందడమూ సాధ్యం కాదు' అని పిటిషనర్ వ్యాజ్యంలో పేర్కొన్నారు. ఇందులో ప్రతివాదులుగా పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి, సంచాలకుడు, ఎన్నికల సంఘాలను పేర్కొన్నారు.

# గొల్లపూడి మారుతీరావు గొప్ప సాహితీవేత్త



హైదరాబాద్, జనవరి2: సినీనటుడు గొల్లపూడి మారుతీరావు గొప్ప సాహితీవేత్త అనీ, నటనకే పాఠశాల అని డాక్టర్ కేవీ కృష్ణకుమారి పేర్కొన్నారు. రచయిత వంగూరి చిట్టెన్‌రాజు ఆధ్వర్యంలో వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా, శ్రీత్యాగ రాయగానసభ సంయుక్త ఆధ్వర్యంలో చిక్కడపల్లిలోని కళాసుబ్బారావు కళా వేదికలో(గానసభ) గొల్లపూడి మారుతీరావు- సాహిత్యసౌరభాలు అనే అంశంపై డాక్టర్ వాణీ తుమ్మలపల్లి ప్రసంగించారు

ముఖ్యఅతిథిగా కళారత్న హంస పురస్కార గ్రహీత డాక్టర్ కేవీ కృష్ణకుమారి(ప్రముఖ రచయిత్రి)హాజరయ్యారు.

కళాబ్రహ్మ, సేవామహాత్మా, శిరోమణి బిరుదులు పొందిన డాక్టర్ వంశీరామ రాజు మేనేజింగ్ ట్రస్టీ, కళాజనార్దనమూర్తి(అధ్యక్షులు, శ్రీత్యాగరాయగానసభ) పాల్గొనగా సభానిర్వహణ డాక్టర్ తెన్నేటి సుధాదేవి ట్రస్టీ నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమం-ప్రముఖ నృత్యగురువు వాణీరమణ శిష్య బృందంచే కూచిపూడి నృత్యప్రదర్శన జరిగింది. నెల నెలా తెలుగు వెన్నెల 157వ సభా కార్యక్రమంలో భాగంగా ఈ సదస్సును నిర్వహించారు.

# మహిళ దారుణ హత్య

## అత్యాచార హత్యగా భావిస్తున్న పోలీసులు

జగిత్యాల,జనవరి2(ఆర్ఎన్ఎ): జిల్లాలోని వెల్గటూరు మండలం కొండాపూర్‌లో అమానుష సంఘటన చోటుచేసుకుంది. గ్రామ శివారులో గుర్తుతెలియని వ్యక్తులు ఓ మహిళను దారుణంగా హతమార్చారు. మహిళ బుధవారం కూలీ పనులకు వెళ్లి ఇంటికి తిరిగి రాలేదు. దీంతో మహిళ ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు గాలింపు చేపట్టగా గ్రామశివారులోని పంటపొలం సమీపంలో వివస్త్రగా మహిళ మృతదేహాన్ని గుర్తించారు. మహిళపై అత్యాచారం చేసి హత్య చేసినట్లు కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి దర్యాప్తు చేపట్టారు.

# ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు ఆత్మహత్యాయత్నం

## తండ్రి, కూతరు మృతి: ప్రాణాపాయంలో భార్య

వనపర్తి,జనవరి2(ఆర్ఎన్ఎ): ఒకే ఇంట్లో తల్లీ, తండ్రి, కూతురు ముగ్గురూ పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకొని ఆత్మహత్యకు పాల్పడ్డారు. కుటుంబ సమస్యల కారణంగానే ఈ ఘాతుకానికి పాల్పడినట్లు తెలుస్తోంది. చిన్నంబావి మండలం, అయ్యవారిపల్లి గ్రామానికి చెందిన బడికల జయన్న కుటుంబ సభ్యులు ముగ్గురు.. బుధవారం రాత్రి 10 గంటలకు తమ ఇంట్లో పెట్రోల్ పోసుకొని నిప్పంట్టించుకున్నారు. విషయం గమనించిన స్థానికులు.. అంబులెన్స్‌కు ఫోన్ చేసి కొల్లాపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా.. ప్రథమ చికిత్స అనంతరం వైద్యులు.. మహబూబ్‌నగర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ.. జయన్న(40), ఆయన కూతురు గాయత్రి(17) మరణించారు. జయన్న భార్య వరలక్ష్మీ ప్రాణాపాయ స్థితిలో ఉంది. చనిపోయిన ఇద్దరి మృతదేహాలను ఆస్పత్రిలోని మార్చురీకి తరలించారు.

# ఎస్ఐ కారును గుద్దిన వారిపై చర్యలు: డీజీపీ

వికారాబాద్,జనవరి2(ఆర్ఎన్ఎ): అనంతగిరిలో ఎస్సై కృష్ణను కారుతో గుద్దిన ఘటనపై డీజీపీ మహేందర్ రెడ్డి స్పందించారు. గాయపడిన ఎస్సై కృష్ణ త్వరగా కోలుకోవాలని ఆశిస్తున్నట్లు ట్విట్టర్‌లో తెలియజేశారు. ప్రాణాలను పణంగా పెట్టి, తమ విధి నిర్వహిస్తున్న పోలీసులను ఈ సందర్భంగా డీజీపీ అభినందించారు. మద్యం సేవించి వాహనం నడిపిన నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామనీ డీజీపీ మహేందర్‌రెడ్డి స్పష్టం చేశారు. కాగా, ఈ ప్రమాదంలో ఎస్సై కృష్ణ కాలు విరగడంతో పాటు, పాదం నుజ్జునుజ్జయింది.

# రక్షణమంత్రితో రావత్ భేటీ

న్యూఢిల్లీ,జనవరి1(ఆర్ఎన్ఎ): రక్షణ దళాల అధిపతి (సీడీఎస్)గా నూతన బాధ్యతలు చేపట్టిన జనరల్ బిపిన్ రావత్ రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో బుధవారం సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా జనరల్ రావత్‌కు రక్షణ మంత్రి శుభాకాంక్షలు తెలిపారు. రాబోయే పదవీ కాలం విజయవంతంగా కొనసాగాలని ఆకాంక్షించారు.

ఆర్మీ చీఫ్‌గా పదవీ విరమణ పొందిన జనరల్ రావత్... సీడీఎస్‌గా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా త్రివిధ దళాలు ఆయనకు ఘనంగా గౌరవ వందనం సమర్పించాయి.

కాగా తొలి సీడీఎస్‌గా బాధ్యతలు చేపట్టిన జనరల్ రావత్‌కు ప్రధాని నరేంద్ర మోదీ శుభాకాంక్షలు తెలిపారు. కొత్త సంవత్సరం, కొత్త దశాబ్దం ప్రారంభమవుతున్న తరుణంలో భారత దేశానికి మొదటి సీడీఎస్ వచ్చారన్నారు. జనరల్ రావత్ భారత దేశానికి గొప్ప శక్తియుక్తులతో, ఉత్సాహంతో సేవలు చేశారని మోదీ ప్రశంసలు కురిపించారు.

# సిసిఐ పునరుద్ధరణలో జోగురామన్న విఫలం: ఎంపి

ఆదిలాబాద్,జనవరి1(ఆర్ఎన్ఎ): తనపై అనవసర విమర్శలు చేస్తే ఊరుకోమని, తాను తలచుకుంటే ఎమ్మెల్యే జోగురామన్నకు టికెట్ రాకుండా చేస్తానని ఎంపీ సోయం బాపూరావు హెచ్చరించారు. భూనిర్వాసితులతో పాటు ప్రధాని మోదీని కలుస్తామని చెప్పారు.

సీసీఐ భూమి నిర్వాసితుల రిలేదీక్షను బాపూరావు సందర్శించారు. ఈ సందర్భంగా బాపూరావు మాట్లాడుతూ రెండు సార్లు టీఆర్ఎస్ అధికారంలోకి వచ్చినా సీసీఐ పరిశ్రమను పునఃప్రారంభించడంలో జోగురామన్న విఫలమయ్యారని బాపూరావు ఆరోపించారు.

# ప్రజల భాగస్వామ్యంతోనే పల్లె ప్రగతి విజయవంతం

## అటవీ శాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి

నిర్మల్,డిసెంబర్ 2 (ఆర్ఎన్ఎ): తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న పల్లె ప్రగతిలో ప్రజల భాగస్వామ్యంతోనే పచ్చదనం-పరిశుభ్రత విజయవంతమవుతుందని అటవీ, పర్యావరణ, న్యాయ, దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి అన్నారు. గ్రామాలను ప్రగతి బాట పట్టించే బృహత్తర పల్లె ప్రగతి రెండో విడత కార్యక్రమాన్ని దిలావర్ పూర్ మండలం సిర్గాపూర్ గ్రామంలో మంత్రి అల్లోల గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పల్లెల్లో పచ్చదనం, పారిశుద్ధ్యాన్ని మెరుగుపరుస్తూ ప్రజల భాగస్వామ్యంతో సమస్యలను పరిష్కరించుకునేందుకు ముఖ్యమంత్రి కే.చంద్రశేఖర్ రావు పల్లె ప్రగతి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. గ్రామాభివృద్ధి లక్ష్యాలను నెరవేర్చడం కోసం ప్రజాప్రతినిధులు, అధికారులు నిబద్ధతతో, కార్యదీక్షతో పనిచేయాలని సూచించారు. పల్లె ప్రగతిని పూర్తి స్థాయిలో విజయవంతం చేసేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రజలను సమన్వయం చేసేందుకు ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగాలన్నారు. తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హరిత హారం కార్యక్రమంలోనాటిన మొక్కలను సంరక్షించాల్సిన భాద్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కొన్ని చోట్ల నాటిన మొక్కలు ఎండిపోవడాన్ని చూసిన మంత్రి స్థానిక అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు.నాటిన మొక్కలకు నీటి వసతి, రక్షణ వలయాలు, నర్సరీలను తెలిపే బోర్డులు, నర్సరీల నిర్వాహణ రిజిస్టర్లు సక్రమంగా ఉండాలని, నిర్లక్ష్యం చేసిన వారిపై తగు చర్యలు తప్పవన్నారు. ఇళ్లతో పాటు గ్రామాన్ని కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ప్రజలపై ఉందన్నారు. గ్రామానికి ప్రతి ఒక్కరూ సేవ చేయాలని తెలిపారు. ప్రభుత్వ లక్ష్యాలు, ఉద్దేశ్యాలకు అనుగుణంగా అధికారులు పనిచేయాలని సూచించారు. ప్రజా ప్రతినిధుల పనితీరును కూడా బేరీజు వేస్తున్నామని, సర్పంచ్‌లు,ఎంపిటిసి,జెడ్పిటిసిలు భాగస్వాములు కావాలని కోరారు. రెండో విడత పల్లె ప్రగతి రాష్ట్ర వ్యాప్తంగా అమలవుతోందని, దీంతో పల్లెలు వికసిస్తాయని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్ పర్సన్ విజయలక్ష్మి, జాయింట్ కలెక్టర్ భాస్కరరావు, ఎంపిపి అమృత చిన్నారెడ్డి, సర్పంచ్ ఈ గంగారెడ్డి, జడ్పీ కో ఆప్షన్ సభ్యులు సుభాష్ రావు, మండల్ కన్వీనర్ దేవేందర్ రెడ్డి, నాయకులు మురళీధర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.




నిర్మల్ జిల్లా దిలావర్ పూర్ మండలం సిర్గాపూర్ గ్రామంలో రెండో విడత పల్లె ప్రగతి కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి. వేదికపై జడ్పీ ఛైర్‌పర్సన్ విజయలక్ష్మి,జాయింట్ కలెక్టర్ భాస్కర్ రావు తదితరులు ఉన్నారు.

# కేటీఆర్ సీఎం అయితే తప్పేంటి..?

## పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి

వరంగల్,డిసెంబర్ 2 (ఆర్ఎన్ఎ): కేసీఆర్ తర్వాత మంత్రి కేటీఆర్ ముఖ్యమంత్రి అయితే తప్పేంటి అని పంచాయతీరాజ్‌శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకరావు ప్రశ్నించారు. కేటీఆర్ అన్నివిధాల సమర్థమైన నాయకుడని అన్నారు. వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం దమ్మన్నపేటలో రెండో విడత పల్లె ప్రగతిని ప్రారంభించిన అనంతరం మంత్రి మీడియాతో మాటాడారు. కోతలు లేకుండా చేసి 24 గంటల నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తున్న ఘనత కేసీఆర్‌దేనన్నారు. వచ్చే మున్సిపల్ ఎన్నికలు పూర్తిగా ఏకపక్షమేనని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ ఎన్నికల్లో బిజెపికి డిపాజిట్లు రావని, కాంగ్రెస్‌కు ఘోర పరాజయం ఉంటుందన్నారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా అవి జరగకుండా అడ్డుకోవడానికి విపక్షాలు చూడటం సాధారణమేనన్నారు. అన్ని మున్సిపాలిటీలు టిఆర్ఎస్ కైవసం చేసుకుంటుందని ఎర్రబెల్లి ధీమా వ్యక్తం చేశారు.

అంతకుముందు మాట్లడుతూ, గ్రామాల ప్రగతి కోసమే పల్లె ప్రగతి కార్యక్రమం తీసుకొచ్చామని చెప్పారు. ఇళ్లతో పాటు గ్రామాన్ని కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ప్రజలపై ఉందన్నారు.

గ్రామానికి ప్రతి ఒక్కరూ సేవ చేయాలని తెలిపారు. నిర్లక్ష్యంగా వ్యవహరించే అధికారులు, ప్రజా ప్రతినిధులపై తప్పకుండా చర్యలు ఉంటాయని మంత్రి స్పష్టంచేశారు. ప్రభుత్వ లక్ష్యాలు, ఉద్దేశ్యాలకు అనుగుణంగా అధికారులు పనిచేయాలని సూచించారు. రెండో విడత పల్లె ప్రగతి రాష్ట్ర వ్యాప్తంగా అమలవుతోందని, దీంతో పల్లెలు వికసిస్తాయని ఆయన ఆకాంక్షించారు.

# కాల్‌మనీ కేసులో ఇద్దరిపై కేసులు

## రౌడీషీట్ తెరిచిన పోలీసులు

గుంటూరు,జనవరి2(ఆర్ఎన్ఎ): కాల్‌మనీ కేసులో గురుశిష్యులను అరెస్టు చేసిన పోలీసులు, ఇద్దరిపై రౌడీషీట్‌లు సైతం తెరిచారు. నిందితులపై గతంలో 9 కేసులు ఉన్నా టీడీపీ అండదండలతో రెచ్చిపోయారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 'స్పందన' కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదలకు సంబంధించి పాత నేరస్తుల చరిత్రను పరిగణనలోకి తీసుకున్న అర్బన్ ఎస్పీ పి.హెచ్‌డి.రామకృష్ణ వారి ఆగడాలను పూర్తి స్థాయిలో నియంత్రించేందుకు కఠిన చర్యలు చేపట్టారు. ఈ నేపథ్యంలో కాల్‌మనీ వ్యాపారులు ఇద్దరినీ లాలాపురం పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. లాలాపేట పోలీస్‌స్టేషన్‌లో ఈస్ట్ డీఎస్పీ కె.సుప్రజ, ఎస్‌హెచ్‌ఓలు ఫిరోజ్, రాజశేఖరరెడ్డి, సురేష్ బాబు ఈ కేసు వివరాలను వెల్లడించారు. వారి కథనం మేరకు.. గుంటూరు విద్యానగర్ ఒకటో లైను ఎక్స్‌టెన్షన్‌కు చెందిన ఇమడాబత్తిని కల్యాణచక్రవర్తి అలియాస్ పప్పుల నాని లాలాపేట పరిధిలోని హజార్ వారి వీధిలో తొలుత పప్పుల వ్యాపారం చేశాడు. అనంతరం 25 ఏళ్లుగా మీటర్ వడ్డీ వ్యాపారం చేస్తున్నాడు. నెహ్రూనగర్ 4వ లైనుకు చెందిన మాజేటి శేఖర్ తొలి నుంచి పప్పుల నానికి అనుచరుడిగా ఉంటు న్నాడు. పప్పుల నాని మీటర్ వడ్డీ, వంద రోజుల వడ్డీ, రోజువారి వడ్డీ వ్యాపారం చేస్తున్నాడు. బాకీ చెల్లించని వారిని తన కార్యాలయానికి పిలిపించి బంధించి కొట్టి చెక్కులు, ప్రామిసరీ నోట్‌లపై అధిక మొత్తం రాయించి సంతకాలు చేయించుకుని పంపేవాడు. కొందరి వద్ద ఖాళీ నోట్‌లు, చెక్‌లపై సంతకాలు చేయించుకునేవాడు. కార్యాలయానికి రాని వారి ఇళ్లకు వెళ్లి దౌర్జన్యం చేసేవాడు. బాకీ వసూలు చేసే క్రమంలో ఒంటరిగా జీవించే మహిళలతో నాని, శేఖర్ అసభ్యంగా ప్రవర్తించారు. కొందరిని తీవ్రంగా వేధింపులకు గురిచేశారు. ఓ మహిళపై లైంగికదాడికి యత్నించడంతో కొత్తపేట స్టేషన్‌లో శేఖర్‌పై ఇటీవల కేసు నమోదైంది. పప్పుల నానికి ఉన్న పలుకుబడి కారణంగా అతని బారినపడిన మహిళలు పోలీసులకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయలేదు. వడ్డీ కోసం గురుశిష్యులు పెట్టే వేధింపులను తట్టుకోలేక గతంలో కొంతమంది ధైర్యం చేసి ఆధారాలతో ఎస్పీలకు ఫిర్యాదు చేసిన సందర్భాల్లో పలు పోలీస్‌స్టేషన్లలో పప్పుల నానిపై ఆరు, శేఖర్‌పై మూడు కేసులు నమోదయ్యాయి. వీరు రిమాండ్‌కు వెళ్లినా వారి అనుచరులు యథావిధిగా కార్యకలాపాలను కొనసాగించేవారు. పప్పులనాని వద్ద గత మార్చి, ఏప్రిల్ నెలల్లో నెహ్రూనగర్ పదో లైనుకుచెందిన ఏలే దుర్గాప్రసాద్, అతని తండ్రి కొండయ్య మీటరు వడ్డీకి ఒకసారి రూ.50 వేలు, మరోసారి రూ.2 లక్షలు తీసుకున్నారు. రోజుకు రూ.5 వేల చొప్పున 50 రోజులు చెల్లించిన అనంతరం, చెల్లింపులు నమోదు చేసిన పుస్తకాన్ని తండ్రీకొడుకుల నుంచి నాని, శేఖర్ లాక్కున్నారు. వడ్డీకి వడ్డీ వేసి ఎక్కువ మొత్తం డిమాండు చేశారు. మొదట ఇచ్చిన ప్రామిసరీ నోట్లు పోయాయంటూ, డిసెంబర్ 28వ తేదీ తండ్రీకొడుకులను నాని, శేఖర్ తమ కార్యాలయంలోబంధించి ఆరు ఖాళీ ప్రామిసరీ నోట్లపై సంతకాలు చేయించుకుని వదిలిపెట్టారు. బాధితులు పోలీస్ స్పందన కార్యక్రమంలోలో ఫిర్యాదు చేయడంతో అర్బన్ ఎస్పీ పి.హెచ్.డి.రామకృష్ణ స్పందించారు. నిందితుల కార్యకలాపాలను కట్టడి చేసేందుకు చర్యలు తీసుకున్నారు. ఇద్దరినీ అరెస్టుచేసి రూ.30,32,900 నగదు, 9 ఖాళీ ప్రామిసరీ నోట్లు, 10 ఖాళీ బ్యాంకు చెక్‌లు, రోజువారి, మీటర్ వడ్డీ లెక్కల పుస్తకాలు స్వాధీనం చేసుకునిరిమాండుకు తరలించారు.

# మైనార్టీల హక్కులు కాలరాస్తున్న బిజెపి: మధు

విజయవాడ,జనవరి2(ఆర్ఎన్ఎ): రాజ్యాంగ పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో సీఏఏ, ఎన్ఆర్సీ, ఎన్‌పీఆర్‌ను వ్యతిరేకిస్తూ నిరసన దీక్ష చేశారు. ఈ దీక్షకు సీపీఐ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శులు రామకృష్ణ, మధు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ.. ఎన్ఆర్సీ పేరుతో లౌకిక వ్యవస్థపై బీజేపీ దాడి చేస్తోందన్నారు. మైనార్టీల హక్కులను బీజేపీ కాలరాస్తోందన్నారు. ఎన్ఆర్సీని అమలు చేయబోమని అసెంబ్లీలో తీర్మానం చేయాలన్నారు. 14 రాష్ట్రాలు బిల్లును వ్యతిరేకిస్తున్నాయని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి మధు పేర్కొన్నారు. అనంతరం రామకృష్ణ మాట్లాడుతూ.. ఎన్ఆర్సీకి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా పోరాటం జరుగుతోందన్నారు. మతాల మధ్య తగాదాలు పెట్టాలని బీజేపీ చూస్తోందన్నారు. ఆర్ఎస్ఎస్ అజెండాను బీజేపీ అమలు చేస్తోందని రామకృష్ణ విమర్శించారు.

# స్విమ్స్ అవరణలో అన్యమత చిహ్నాలు

## ఆస్పత్రి వర్గాలకు ఫిర్యాదుచేసిన రోగులు

తిరుపతి,జనవరి2(ఆర్ఎన్ఎ): తిరుపతి స్విమ్ ఆవరణలో అన్యమత చిహ్నాలు కనిపించాయి. కొద్ది కాలంగా టిటిడిలో అన్యమత ప్రచారం జరుగుతోందన్న విమర్శలు వస్తున్న నేపథ్యంలో.. ఈ ఘటన కలకలం రేపింది. తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో నడిచే స్విమ్స్ ఆస్పత్రిలోని ఆవరణలో ఉన్న 4, 5 చెట్లపై శిలువ గుర్తులు కలకలం రేపాయి. గురువారం తెల్లారేసరికి ఆస్పత్రి ప్రాంగణంలోని చెట్లపై శిలువ గుర్తులు ప్రత్యక్షమయ్యాయి. ఆ శిలువ గుర్తులను చూసిన రోగులు ఆస్పత్రి వర్గాలకు ఫిర్యాదు చేశారు. ఆస్పత్రి సిబ్బంది ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్విమ్ సిబ్బంది ఆ గుర్తులను తొలగించే ప్రయత్నాలు చేపట్టారు. గుర్తులున్న చెట్ల బెరడును చెక్కేశారు. భద్రతా సిబ్బంది నిర్లక్ష్యమంటూ భక్తులు ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. ఈ ఘటన ఎలా జరిగిందనే దానిపై అధికారులు విచారణ చేపట్టారు. పోలీసులు ఎలర్ట్ అయ్యారు. స్పెషల్ బ్రాంచ్ పోలీసులు కూడా ఎలర్ట్ అయ్యారు. ఉద్దేశపూర్వకంగా జరిగిందా.. ఎవరైనా కావాలనే ఇలా చేశారా.. అనే కోణంలో విచారణ కొనసాగుతోంది.

# రాష్ట్రపతి నిలయానికి సందర్శకులకు అనుమతి

హైదరాబాద్,జనవరి2(ఆర్ఎన్ఎ): రాష్ట్రపతి నిలయం సందర్శనానికి సందర్శకులకు అనుమతి లభించింది. దీంతో సందర్శకులు వస్తున్నారు. బొల్లారంలోని రాష్ట్రపతి నిలయం పర్యాటక కేంద్రంగా ప్రసిద్ధి చెందింది. రాష్ట్రపతి శీతాకాల విడిది కోసం ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం కూడా రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్.. గత నెల 28 వరకు ఇక్కడ బస చేశారు. జనవరి 2 నుండి జనవరి 17 వరకు రాష్ట్రపతి నిలయం సందర్శనకు అనుమతి ఇవ్వనున్నారు. అక్కడ ప్రకృతి శోభితమైన, ఆహ్లాదకరమైన పచ్చదనం, ప్రశాంత వాతావరణం ఉంటుంది. భారీ వృక్షాలు వాటి మధ్య ఉద్యానవనాలు, పూలు, పండ్ల తోటలు, ఫౌంటెయిన్లు చూడముచ్చటగా ఉంటాయి. గత సంవత్సరం రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఒకేసారి 7 వేల మొక్కలను నిలయంలోని ఖాళీ స్థలాల్లో నాటించారు.

Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas, Ph.No.040- 2766 2477.
**RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com.